MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 308 | పేజీలు : 8 | బుధవారం 28 అక్టోబర్ 2026 | వెల : 6-00



దేశ ప్రయోజనాలే కొనుగోళ్లలో కీలకం

- రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఒత్తిడి లేదన్న హర్దీప్ పురి
- యుద్ధానికి ముందు రష్యా చమురుపై భారత్ ఆధారపడింది 0.2 శాతమే
- రాయితీల కారణంగా యుద్ధం తర్వాత పెరిగిన రష్యా చమురు కొనుగోళ్లు
- సెప్టెంబర్‌లో పెరిగిన మధ్యప్రాచ్య చమురు దిగుమతులు

5



మణిపూర్‌లో భద్రతా దళాల ఆపరేషన్

- రైఫిళ్లు, గ్రెనేడ్లు సహా భారీగా డ్రగ్స్ స్వాధీనం!
- భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- రైఫిళ్లు, 240 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
- 1.027 కిలోల బ్రౌన్ షుగర్ పట్టివేత
- 23 ఏళ్ల యువకుడి అరెస్ట్

మందుల కంపెనీల కోసమే మొత్తం వ్యవస్థ పనిచేస్తోందా?

- మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలా?
- ఎన్‌పీపీఏ పనితీరుపై అసంతృప్తి

సమన్వయంతో ముందుకు

గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థల బలోపేతం కీలకం

- 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి..
- చంద్రబాబు, పవన్ కల్యాణ్, పీవీఎన్ మాధవ్ స్పష్టం
- ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం
- గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థల బలోపేతం కీలకం
- క్షేత్రస్థాయి వరకు మూడు పార్టీల మధ్య సమన్వయం ఉండాలి



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కొనేందుకు కూటమి పార్టీలు సిద్ధమయ్యాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఐక్యతను చాటుతూ ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను కోరారు. స్థానిక సంస్థలు బలోపేతమైనప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని- మిగతా 2లో



ఏ ఒక్క ప్రాణం పోకూడదన్నదే

ప్రభుత్వ ధ్యేయం

- తుపాను ఒక్కోసారి దిశ మార్చుకుంటుంది.. అందుకే ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం
- తుపానులు అనూహ్యంగా దిశ మార్చుకుంటాయన్న సీఎం చంద్రబాబు
- గతంలో హుదూద్, 1996 పెను తుపాను అనుభవాలను గుర్తు చేసుకున్న ముఖ్యమంత్రి
- ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టీకరణ
- తుపాను పూర్తిగా తీరం దాటి, వర్షాలు తగ్గే వరకు ఎవరూ బయటకు రావొద్దని విజ్ఞప్తి
- ప్రజల కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని, సహకరించాలని కోరిన చంద్రబాబు

2

ఈసీ అఫిడవిట్ మోసపూరితం ఆ సంస్థకే నష్టం చేకూర్చేలా ఉంది


- ఈసీ అఫిడవిట్‌పై కాంగ్రెస్ అభ్యంతరం
- ఫారం-6 డిక్లరేషన్‌పై వివాదం
- నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపణ
- ఈసీనెట్ వ్యవస్థపై విమర్శలు
- పిటిషన్లను కొట్టివేయాలని ఈసీ విజ్ఞప్తి
- ర్యాలీకి అనుమతి యథాతథం
- భద్రతకు 3,500 మంది పోలీసులు
- సీసీటీవీలతో పటిష్ఠ నిఘా



5

సాంకేతిక రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

- కీలక టెక్నాలజీల్లో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం
- మేడ్ ఇన్ ఇండియా చిప్స్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- అణు, అంతరిక్షం నుంచి ఏఐ, సెమీకండక్టర్ల వరకు సరికొత్త ఆవిష్కరణలు
- భారత సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపాలి: ప్రధాని మోదీ





అర్నాబ్ కల్లోలం

- రాష్ట్రవ్యాప్తంగా అర్నాబ్ తుపాను ప్రభావం
- పలుచోట్ల భారీ వర్షాలు.. బలమైన ఈదురుగాలులు
- విశాఖలో భారీ వృక్షం నేలకూలి రాకపోకలకు అంతరాయం
- గాజువాకలో కూలిన పాఠశాల ప్రహరీ గోడ
- ఉభయ గోదావరి జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షాలు
- కోనసీమలో ఉధృతంగా సముద్ర అలలు
- తునిలో చెట్టు కూలి ఒకరికి గాయాలు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- మత్స్యకార కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలింపు

2లో

ఈ రెండేళ్లు ఓపిక పట్టండి..

వచ్చేది జగన్ 2.0



- పులివెందుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సందేశం
- కార్యకర్తలకు అండగా ఉంటానన్న వైఎస్ జగన్
- అన్యాయం చేసిన అధికారులను వదిలిపెట్టబోమని వ్యాఖ్య
- స్థానిక ఎన్నికల్లో నామినేషన్ల అడ్డగింతపై ఆరోపణలు
- మహిళా అభ్యర్థులపై దాడులు జరిగాయంటూ విమర్శలు
- పోలీసుల తీరుపై జగన్ తీవ్ర ఆగ్రహం
- 17 మున్సిపాలిటీల ఏకగ్రీవాలపై అభ్యంతరాలు
- ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కాపాడుకోవాలని పిలుపు
- మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ రోజున పులివెందులకు వస్తానని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ధీమా

వైఎస్సార్/అమరావతి, మహానగర్

పులివెందులలో సౌండ్ రాష్ట్రంలో మోగాలి.. కూటమి ప్రభుత్వం తుడిచిపెట్టుకుపోతుంది.. పులివెందులలో మా వాళ్లపై చెయ్యి వేస్తే నాపై వేసినట్టేనని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పులివెందులలో పార్టీ నేతలు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అంటూ స్పష్టం చేశారు. "అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టం. మా టైం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం. రిటైర్ అయిన అధికారిని కూడా ఎక్కడున్నా తీసుకొస్తాం. మీరు డ్యూటీ చేస్తున్నది చంద్రబాబు కోసం కాదు. మీ టోపీపై మూడు సింహాలను చూసి డ్యూటీ చేయండి. రక్షకులుగా ఉండాల్సినవారే దౌర్జన్యం చేస్తే కాపాడేదెవరు?. అరెస్టులు చేసినా, కేసులు పెట్టిన భయపడేది లేదు" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది అక్కచెల్లెమ్మలే. అక్కచెల్లెమ్మల నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. నడిరోడ్డుపై అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు.అక్కచెల్లెమ్మలపై దాడి చేయడానికి మీకు సిగ్గుందా?. వైఎస్సార్‌సీపీ - మిగతా 2లో

అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

బకాయిలు, సంక్షేమ ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు : సీపీ ఎస్.వి.రాజశేఖర బాబు

విజయవాడ క్రైమ్, మహానగర్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు 2026లో భాగంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు మంగళవారం నాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన పోలీసుల కుటుంబాలకు అందాల్సిన ప్రయోజనాలు, బకాయిలపై సమీక్షించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ ద్వారా అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సక్రమంగా అందాయా లేదా అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా బకాయిలు లేదా ప్రయోజనాలు అందాల్సి ఉంటే వాటిని త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన నిబద్ధత కలిగిన అధికారులు, సిబ్బందిని కోల్పోవడం బాధాకరమని, వారి సేవలు, త్యాగాలు పోలీస్ శాఖకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో సేవలు, పండుగలు, ఎన్నికల సమయంలో పోలీసులు నిర్వర్తించే బాధ్యతలు ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు సంస్మరణ వారోత్సవాల జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, ఏఆర్ఏ



డీసీపీ ఎన్.వి.రమణ, ఏఆర్ఏ ఏసీపీ ప్రేమ్‌కుమార్, సీటీసీ ఏసీపీ ఉమామహేశ్వరరెడ్డి, ఏఏఓ మహమ్మద్ ఇల్లియాస్ అహ్మద్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య, సీపీ కార్యాలయ పరిపాలనా విభాగ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అర్నాబ్ కల్లోలం

రాష్ట్రంపై అర్నాబ్ అతి తీవ్ర తుపాను ప్రభావం మొదలైంది. తీవ్ర తుపాను ప్రభావంతో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలుల ధాటికి పలుచోట్ల చెట్లు, గోడలు నేలకూలాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభావిత ప్రాంతాల ప్రజలను తరలిస్తున్నారు.

అర్నబ్ అతి తీవ్ర తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలుల ధాటికి విశాఖ సిరిపురం పెట్రోల్ బంక్ జంక్షన్‌లో తుఫాన్ ప్రభావంతో భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టు కూలిపోవడంతో రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న సిబ్బంది కూలిన చెట్టును తొలగించి, పునరుద్ధరణ పనులు చర్యలు చేపట్టారు. విశాఖ గాజువాక పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. పాఠశాల ఆవరణలోని చెట్టు కూలడంతో ప్రహరీ గోడ ధ్వంసమైనట్లు తెలుస్తోంది. తుపాను నేపథ్యంలో పాఠశాలకు సెలవు ప్రకటించడంతో పిల్లలెవరూ రాలేదు. విద్యార్థులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పలు చోట్ల జోరుగా వర్షం

అర్నబ్ ప్రభావంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచీ వాతావరణ మేఘావృతమై ఉండగా మధ్యాహ్నం నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. క్రమంగా పెరుగుతూ పలు చోట్ల జోరుగా వర్షం కురుస్తోంది. రాజమహేంద్రవరంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. రాజానగరం, కడియం సహా పలు మండలాలు, గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. గోదావరి నది పాయల్లో ఉండే మత్యకార కుటుంబాలను రాజమహేంద్రవరంలోని పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు.

లోతట్టు ప్రాంతాలను గుర్తించి వెంటనే సమీపంలోని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. అర్నబ్ తుపాను ప్రభావంతో కోనసీమ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. సముద్ర తీరం వెంట అలలు ఎగసిపడుతున్నాయి. ఉప్పలగుప్తం మండలం వాసాల తిప్ప వద్ద సముద్ర ఉధృతి క్రమంగా పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తోంది. అంబాజీపేట,రావులపాలెం మండలాల్లో వర్షం కురిసింది. తీరంలోని మత్స్యకారుల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పోలవరం జిల్లాలోనూ వర్షం ప్రారంభమైంది. రంపచోడవరంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది.

లాడ్జి అద్దాలు ధ్వంసం

కాకినాడ జిల్లా తునిలో ఈదురుగాలుల ప్రభావంతో రైల్వేస్టేషన్ వద్ద ఓ భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కూలిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఆయన్ని ఆసుపత్రికి తరలించారు. గాలుల ప్రభాతంవో ఓ లాడ్జి అద్దాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. ఈదురుగాలులు వీస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు ప్రమాదకరంగా ఉన్న చెట్లు, స్తంభాలను తొలగించారు. జిల్లా వ్యాప్తంగా బలమైన గాలులు వీస్తున్నాయి. చాలాచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. సముద్రతీర ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్రపాలిత యానాం యానాం తీర ప్రాంతంలో తుపాను తీరం దాటుతుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో స్థానిక ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు కోనసీమ జిల్లా పరిధిలోని ఐ.పోలవరం





మండలం భైరవపాలెం, తీర్థాలమొండి గ్రామాల ప్రజలను కలిశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. యానాంలోని 18 పాఠశాలల్ని పునరావాస కేంద్రాలుగా మార్చి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో నాగావళి నది ఉద్ధృతంగా ప్రవహించే అవకాశం ఉండటంతో పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను బూర్జ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.

ఏ ఒక్క ప్రాణం పోకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయం

"తుపాను ఒక్కోసారి వేగం పుంజుకుంటుంది, ఒక్కోసారి నెమ్మదిస్తుంది, కొన్నిసార్లు అనూహ్యంగా దిశ కూడా మార్చుకుంటుంది. అందుకే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తీవ్ర తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం రాత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఆస్తి నష్టాన్ని నివారించడం రెండో ప్రాధాన్యత అని ఆయన తేల్చి చెప్పారు. ప్రస్తుత తుపానును అత్యంత తీవ్రమైనదిగా వాతావరణ శాఖ వర్గీకరించిందని, దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని చంద్రబాబు తెలిపారు. "తుపాను బుధవారం ఉదయం 5 నుంచి 9 గంటల మధ్య కాకినాడ–యానాం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 140 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చు. కొన్నిసార్లు గాలి వేగం 180 కిలోమీటర్లకు కూడా చేరవచ్చు. తుపాను తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కొనసాగుతాయి. కాబట్టి, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దు," అని ఆయన విజ్ఞప్తి చేశారు.

గత అనుభవాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు

ఇలాంటి విపత్తులను ఎదుర్కోవడం తనకు కొత్తేమీ కాదని చెబుతూ, ముఖ్యమంత్రిగా తన సుదీర్ఘ అనుభవాలను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా 1996–97లో తూర్పు గోదావరి జిల్లాను అతలాకుతలం చేసిన పెను తుపాను, హుదూద్ విలయాన్ని ఆయన ప్రస్తావించారు. "1996లో వచ్చిన పెను తుపానుకు సుమారు 2,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ వార్త తెలియగానే హైదరాబాద్ నుంచి బయలుదేరాను. వాతావరణం అనుకూలించకపోయినా, పైలట్లకు ధైర్యం చెప్పి, అండర్‌టేకింగ్ రాసిచ్చి హెలికాప్టర్‌లో విపత్తు ప్రాంతానికి వెళ్లాను. ముమ్మిడివరం, అమలాపురంలో దిగి, 'నేనున్నానంటూ' ప్రజలకు భరోసా ఇచ్చాను. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు వాతావరణం సహకరించకపోవడంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. అక్కడి నుంచే అప్పటి ప్రధానమంత్రి దేవెగౌడ గారికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించి, తక్షణ సాయం కోరాను. ఆ తర్వాత రాజమండ్రినే కేంద్రంగా చేసుకుని, అధికారులను మండలాల వారీగా నియమించి, సహాయక చర్యలు చేపట్టాను. ప్రైవేటు లారీలను సైతం స్వాధీనం చేసుకుని ఎమర్జెన్సీ పనులకు ఉపయోగించాను" అని చంద్రబాబు వివరించారు. అలాగే హుదూద్ తుపాను సమయంలో విశాఖపట్నం నగరం చిగురుటాకులా వణికిపోయిందని, తాను నేరుగా విశాఖ వెళ్లలేక విజయవాడలో దిగి, రోడ్డు మార్గంలో అక్కడికి చేరుకున్నానని తెలిపారు. "వారం రోజుల పాటు అక్కడే ఉండి, నగరాన్ని తిరిగి గాడిన పెట్టే వరకు విశ్రమించలేదు. పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి కూరగాయలు తెప్పించాను. ఆ అనుభవంతోనే భవిష్యత్తులో ఇలాంటి నష్టం జరగకూడదని విశాఖలో అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేశాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ అనుభవాలన్నింటినీ ఉపయోగించి, టెక్నాలజీని జోడించి ప్రస్తుత విపత్తును ఎదుర్కొంటున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలకు చంద్రబాబు చేసిన ముఖ్య సూచనలు

తుపాను పూర్తిగా తీరం దాటి, అధికారులు సురక్షితమని చెప్పేవరకు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దు. ముఖ్యంగా తెల్లవారుజామున కాలకృత్యాల కోసం బయటకు వెళ్లే అలవాటును మానుకోవాలి.

అన్ని రకాల ప్రయాణాలను పూర్తిగా రద్దు చేసుకోవాలి.

సెల్‌ఫోన్లు, పవర్‌బ్యాంకులను ముందుగానే ఛార్జ్ చేసి పెట్టుకోవాలి. కొవ్వొత్తులు, నిత్యావసరాలను సిద్ధంగా ఉంచుకోవాలి. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు. తమ బోట్లను చూసేందుకు కూడా తీరానికి వెళ్లడం ప్రమాదకరం. లోతట్టు ప్రాంతాల ప్రజలు, లంక గ్రామాల వారు తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి. గ్రామాల్లోని యువత, ప్రజలు తమ ఊరి చెరువులకు గండ్లు పడకుండా కాపాడుకోవాలి. ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. ప్రభుత్వ యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరించాలి. ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, ఇప్పటికే 84 వేల మందికి పైగా ప్రజలను 2,199 పునరావాస కేంద్రాలకు తరలించామని చంద్రబాబు తెలిపారు. 12 ఎన్డీఆర్ఎఫ్, 10 ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు నేవీ, కోస్ట్‌గార్డ్, పోలీస్, అగ్నిమాపక దళాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయని చెప్పారు. వైద్య బృందాలు, అత్యవసర మందులు, విద్యుత్ పునరుద్ధరణ సిబ్బంది, తాగునీటి ట్యాంకర్లు, జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. "నేను రాత్రంతా పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తాను. ప్రజలు అధైర్యపడొద్దు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0

-మొదటిపేజీ తరువాయి

హయాంలోనే అక్కచెల్లెమ్మలకు న్యాయం జరిగింది. చంద్రబాబు చేస్తున్న పనులకు తానే సిగ్గుతో తలదించుకోవాలి. 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని వీళ్లే ప్రకటించుకున్నారు. పులివెందులలో 20 వార్డుల్లోనే నామినేషన్లు వేయగాలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు కేవలం 4 స్థానాల్లో పోటీ జరుగుతుంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో నామినేషన్లు తిరస్కరించారు. "పోలీసులను ప్రశ్నిస్తే లాఠీఛార్జ్ చేశారు. నామినేషన్లు వేయడానికి వెళ్తుంటే కాల్పులు జరిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై 37 రౌండ్ల కాల్పులు జరిపారు. పోలీసులు బలప్రయోగం ఎందుకు చేశారు. నామినేషన్ల వేయడానికి రావడం తప్పా?. పోటీకి ఇంత భయముంటే ఎన్నికలు ఎందుకు పెట్టారు. సుప్రీం ఆదేశాలిచ్చినా ఎస్ఈసీ, అధికారుల్లో మార్పు రాలేదు. ఇది తొండా, దౌర్జన్యం, అన్యాయం కాదా?. కడపలో 17 జడ్పీటీసీ స్థానాల్లో పోటీ లేకుండా చేశారు. అధికారుల సమక్షంలోనే నామినేషన్లు చించివేశారు. అధికారుల సమక్షంలోనే మన హక్కులను లాగేసుకున్నారు. ..రేపు మన ఆస్తి పత్రాలను కూడా లాక్కుంటారు. తిరగబడండి.. మీ అన్న మీకు తోడుగా ఉంటాడు. పులివెందులలో కొడితే చెంప గుయ్‌మనాలి. పులివెందులలో సౌండ్ రాష్ట్రంలో మోగాలి. కూటమి ప్రభుత్వం తుడిచిపెట్టుకుపోతుంది. పులివెందులలో మా వాళ్లపై చేయ్యి వేస్తే నాపై వేసినట్టే. అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టం. మా టైం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తాం. రిటైర్ అయిన అధికారిని కూడా ఎక్కడున్నా తీసుకొస్తాం" అని వైఎస్ జగన్ తేల్చి చెప్పారు. "మీ మీద పడ్డ దెబ్బను మీ అన్న చూస్తూ ఊరుకోడు. జగన్ 2.0లో జగన్ ఒక్కటైతే.. రెండోది కార్యకర్తే. మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ రోజు నేను పులివెందుల వస్తా. మీరు తోడుగా నిలబడ్డారు కాబట్టే నేను సీఎం అయ్యాను. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం. మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి.. మీ అన్న మీకు తోడుగా ఉంటాడు" అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

సమన్వయంతో ముందుకు



-మొదటిపేజీ తరువాయి

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. అమరావతిలో నిర్వహించిన కూటమి అగ్రనేతల మీడియా సమావేశంలో ముగ్గురు నాయకులు స్థానిక ఎన్నికలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనే చర్యలపై మాట్లాడారు.

ప్రజల హామీలను నెరవేర్చాం: చంద్రబాబు

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, అందుకే స్థానిక ఎన్నికల్లో ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. బాధ్యతాయుతమైన నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని విమర్శించిన ఆయన, రాష్ట్ర పునర్నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టులను ఆశ్రయించిందని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ స్పందనను విడిగా పరిగణించాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో కూటమి సాధించిన 94 శాతం స్ట్రైక్ రేట్ ప్రజల్లో ఉన్న మార్పు ఆకాంక్షను ప్రతిబింబించిందని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమన్వయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు నమోదైనా నీటి వనరులను సమర్థంగా నిర్వహించి డెల్టా ప్రాంతానికి సాగునీరు అందించగలిగామని వివరించారు. అన్ని రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా జలాలను రాయలసీమకు తరలించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థలే పునాది: పవన్ కల్యాణ్

స్థానిక సంస్థలు బలోపేతమైతేనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. తన శాఖ పరిధిలో గత రెండున్నరేళ్లలో లక్షన్నర కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పథకాలను పునరుద్ధరించామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య సమన్వయం క్షేత్రస్థాయి వరకు కనిపించాలని పవన్ కల్యాణ్ సూచించారు. సీట్ల సర్దుబాటు ప్రక్రియలో సీఎం చంద్రబాబు చొరవ తీసుకున్నారని, అన్ని సవాళ్లను అధిగమించి మూడు పార్టీలు కలిసి ముందుకు సాగుతున్నాయని తెలిపారు. తుది జాబితా ప్రకారం బీఫామ్‌లు అందజేస్తామని, వాటిని పొందిన అభ్యర్థులే పోటీలో ఉండాలని స్పష్టం చేశారు. టికెట్లు దక్కని నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతకు ఎవరూ విఘాతం కలిగించవద్దని కోరారు. స్థానిక ఎన్నికల ఏర్పాట్లతో పాటు అర్నాబ్ తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పవన్ తెలిపారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ఎన్నికలకు: పీవీఎన్ మాధవ్

స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సుదీర్ఘ చర్చల అనంతరం పూర్తయిందని, ప్రత్యర్థులు ఆశించినట్లుగా కూటమిలో విభేదాలకు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి సమన్వయంతో నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. 'చెప్పాం--చేస్తున్నాం' నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని మాధవ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత సేవ అందిస్తామని చెప్పారు. స్థానిక స్థాయిలోనూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

తుపాను ప్రభావంపై అప్రమత్తం

అర్నాబ్ తుపాను నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. తుపాను ప్రభావంతో నష్టం తగ్గించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు వంటి సవాళ్లను సమష్టి కృషితో అధిగమించాలని అన్నారు. స్థానిక ఎన్నికల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని కూటమి నేతలు తెలిపారు. పార్టీల మధ్య ఐక్యతను క్షేత్రస్థాయిలోనూ కొనసాగిస్తూ ప్రజల మద్దతుతో ఎన్నికలను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

సరస్ మేళా వేదికగా మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ

విజయవాడ, మహానగర్:

నగరంలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న ఆజీవిక జాతీయ సరస్ మేళా 2026లో స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలకు జీవనోపాధుల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన--జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ పంచాయతీరాజ్ సంస్థలు-సమాజ ఆధారిత సంస్థల సమన్వయ బృందం ప్రాజెక్ట్ లీడ్ అరిందమ్ బోరా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అభివృద్ధి ప్రణాళికల్లో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవడం, ప్రజా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, స్థిరమైన జీవనోపాధులను అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలు, స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళిక చేయడం, అమలు చేయడం, పర్యవేక్షించడం సాధ్యమవుతుందని అరిందమ్ బోరా వివరించారు. గ్రామ సమృద్ధి, స్థితిస్థాపకత ప్రణాళిక ద్వారా గ్రామీణ కుటుంబాల అవసరాలను గుర్తించి, గ్రామసభలో ప్రవేశపెట్టి, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చవచ్చని తెలిపారు. వ్యవసాయం, పశుపోషణ, ఆహార శుద్ధి, చేనేత, హస్తకళలు, ఇతర సూక్ష్మ పరిశ్రమలకు అవసరమైన పెట్టుబడులు, రుణాలు, నైపుణ్య శిక్షణ, పరికరాలు, మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సహాయాన్ని ప్రభుత్వ పథకాలతో అనుసంధానించుకోవాలని సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఉత్పత్తుల అభివృద్ధి, బ్రాండింగ్, ప్యాకేజింగ్, ధ్రువీకరణ, మార్కెట్



అనుసంధానంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. సరస్ ఆజీవిక మేళాలు, ఈ-సరస్, జీఈఎం సరస్ కలెక్షన్, ఓఎన్‌డీసీ డిజిటల్ మార్కెట్ వేదికల ద్వారా ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని వివరించారు. వివిధ రాష్ట్రాల్లో మహిళా సంఘాలు చేపట్టిన హస్తకళలు, రేషన్ దుకాణాల నిర్వహణ, రవాణా సదుపాయాలు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, వర్మీకంపోస్టు యూనిట్ల వంటి జీవనోపాధి కార్యక్రమాల ఉదాహరణలను వివరించారు. మహిళా సంఘాలు స్థానిక పాలనలో చురుకుగా పాల్గొని, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సంస్థలు, మార్కెట్ వేదికల సహకారంతో స్థిరమైన గ్రామీణ జీవనోపాధులను సాధించాలని ఈ కార్యక్రమం ద్వారా సూచించారు.

మూడంచెల భద్రతతో కార్పొరేషన్ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

లయోలా కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

ఎన్నికల నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశాలు





విజయవాడ, మహానగర్

నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి లయోలా కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్యాన్‌చంద్ర హెచ్.ఎం.తో పాటు ఇతర అధికారులు ఏర్పాట్ల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలు, ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పాటు సీసీటీవీ కెమెరాల నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు వేగంగా, పారదర్శకంగా జరిగేలా టేబుళ్ల ఏర్పాటు, బారికేడింగ్ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్, జనరేటర్లు, తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ధ్యాన్‌చంద్ర హెచ్.ఎం.కు సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు, సంబంధిత నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అర్నబ్ తుపాను నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ముందస్తు చర్యలు

జిల్లావ్యాప్తంగా 166 పునరావాస కేంద్రాలు ఏర్పాటు

జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు

అధికారిక హెచ్చరికలను మాత్రమే పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచన

విజయవాడ, మహానగర్

అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు, పెనుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. తుపాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంగళవారం ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అనంతరం కలెక్టరేట్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయవాడ డివిజన్‌లో 7569008425, తిరువూరు డివిజన్‌లో 08673-251235, నందిగామ డివిజన్‌లో 7893053534 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల వివరాలను



కూడా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే సంబంధిత కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లావ్యాప్తంగా 166 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 29, తిరువూరు డివిజన్‌లో 77, నందిగామ డివిజన్‌లో 44, విజయవాడ డివిజన్‌లో 16 కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. పరిస్థితుల తీవ్రత, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అత్యవసర వైద్య సేవలకు సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. తుపాను సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అధికారులు సూచించినప్పుడు సమీప పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. నదులు, వాగులు, వంకల వైపు వెళ్లకూడదని, ప్రవహించే నీటిని దాటేందుకు ప్రయత్నించరాదని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకుండా, అధికారికంగా జారీ చేసే హెచ్చరికలు, సూచనలను మాత్రమే పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ రూరల్, మహానగర్:

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం), వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత కల్పించడం జరిగిందని.. అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు ఏదుపాటి రామయ్య (తెదేపా), మురళీకృష్ణ (ఐఎన్‌సీ), జడగం శ్రీనివాసరావు (జనసేన పార్టీ), సురేష్ (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల వ్యయాల పర్యవేక్షణ

పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలి

ప్రతి అడుగులోనూ అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల వ్యయ జిల్లా పరిశీలకులు బి. విజయ్ కుమార్

విజయవాడ, మహానగర్



జిల్లాలో స్థానిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల వ్యయాల పర్యవేక్షణలో అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని ఎన్నికల వ్యయ జిల్లా పరిశీలకులు బి.విజయ్ కుమార్ సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ, ప్రతి అంశంలోనూ జవాబుదారీతనాన్ని పాటించాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్.. సహాయ వ్యయ పరిశీలకులతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్, ఎంసీసీ, ఎంసీఎంసీ, అకౌంటింగ్ టీమ్, ఎక్సైజ్ తదితర విభాగాలు, శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కమిటీల పనితీరును పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ), వీడియో సర్వైలెన్స్ టీమ్స్ (వీఎస్‌టీ) తదితర బృందాల మధ్య సమన్వయంపైనా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల వ్యయాలకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, విధుల నిర్వహణలో ప్రతి అడుగులోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరైన ప్రొఫార్మాలో నివేదికల రూపకల్పనతో పాటు వాటిని నిర్దేశ సమయంలోగా సమర్పించాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, మీడియా ద్వారా ప్రసారమయ్యే ఎన్నికల సంబంధిత ప్రకటనల పర్యవేక్షణ, అభ్యర్థుల వ్యయాల లెక్కల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్సైజ్ సహా సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న తనిఖీలు, పర్యవేక్షణ చర్యలను నిరంతరం కొనసాగించాలని, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే అక్రమ కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల వ్యయాల పర్యవేక్షణలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా, అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తించేలా చర్యలు చేపట్టాలని వ్యయ పరిశీలకులు విజయ్ కుమార్ తెలిపారు.

ఘనంగా చిన్మయ అమృత్ మహోత్సవ్ ప్రపంచ సమ్మేళనం




న్యూఢిల్లీ, మహానగర్

చిన్మయ ఉద్యమం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత్ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించిన చిన్మయ అమృత్ మహోత్సవ్ ప్రపంచ సమ్మేళనం ఆదివారం ముగిసింది. భారత్‌తో పాటు వివిధ దేశాల నుంచి 9 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. అక్టోబర్ 23న ప్రధాని నరేంద్ర మోదీ సమ్మేళనాన్ని ప్రారంభించారు. చివరి రోజు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఐక్యరాజ్యసమితి భారత్ రెసిడెంట్ కోఆర్డినేటర్ స్టీఫన్ ప్రీస్నర్, సుమారు 80 మంది రాయబారులు పాల్గొన్నారు. అద్వైత తత్వం ప్రపంచ ఐక్యతకు మార్గం చూపుతుందని జైశంకర్ పేర్కొన్నారు. స్వామి చిన్మయానంద బోధనలను ప్రచారం చేసే చిన్మయ అమృత్ యాత్ర భారత్, నేపాల్, శ్రీలంకల్లో 40 వేల కిలోమీటర్లు ప్రయాణించింది. ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఫెడరల్ ఫ్రంట్ సాధ్యమేనా?

జాతీయ రాజకీయాల్లో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయ శక్తులను ఒకే తాటిపైకి తెచ్చేందుకు భారత రాష్ట్ర సమితి అధినేత కే.చంద్రశేఖర్ రావు మళ్లీ వేగంగా పావులు కదుపుతున్నారని కేటీఆర్ సంకేతాలు ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి నియంత్రణను, దర్యాప్తు సంస్థల దూకుడును ఎదుర్కొనేందుకు ఒక పటిష్టమైన ఫెడరల్ ఫ్రంట్ లేదా రీజినల్ అలయన్స్ అవసరమనే చర్చను బీఆర్ఎస్ తిరిగి తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా ఏపీలో అధికారం కోల్పోయిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ , ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ లాంటి బలమైన ప్రాంతీయ దిగ్గజాలతో మళ్లీ టచ్‌లోకి వెళ్లేందుకు గులాబీ దళపతి గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నట్లు పొలిటికల్ సర్కిళ్లలో చర్చ సాగుతోంది.ఈ ప్రాంతీయ కూటమి ప్రయత్నంలో కేసీఆర్‌తో కలసి రావడానికి ఏ పార్టీకి ఎంతవరకు సానుకూలత ఉందనేది ఇప్పుడు ఆసక్తికరమైన అంశం. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య మొదటి నుంచి సత్సంబంధాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయాక, అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్, బీజేపీల ఉమ్మడి రాజకీయ ఒత్తిడి పెరిగిన తరుణంలో జగన్-కేసీఆర్‌లు ఒకరికొకరు మద్దతుగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లను తట్టుకోవడానికి, పార్లమెంట్ పరిధిలోనూ ప్రాంతీయ బలాన్ని ప్రదర్శించడానికి ఈ ఇద్దరు నేతలు ఒకే వేదికపైకి రావడం ఇరు పార్టీలకు రాజకీయంగా ఊరటనిచ్చే అంశం. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, ఈ థర్డ్ ఫ్రంట్ మోడల్‌కు ప్రధాన భాగస్వామిగా మారే అవకాశాలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కలస్తున్నా.. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నేతలు మమతా బెనర్జీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా లేరు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తన పెద్దన్న పాత్రను రుద్దడాన్ని దీదీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ పార్టీల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, అలాగే బెంగాల్ వేదికగా కేంద్ర ప్రభుత్వంతో సాగిస్తున్న పోరాటంలో ప్రాంతీయ మిత్రుల మద్దతు పొందేందుకు మమత-కేసీఆర్‌ల వ్యూహాలు సులువుగా సరిపోతాయి. గతంలో కూడా కేసీఆర్ కలకత్తా వెళ్లి మమతా బెనర్జీతో జరిపిన భేటీలు, ఆ తర్వాత రూపొందించిన ఫెడరల్ ఫ్రంట్ కార్యాచరణ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా కాంగ్రెస్‌పై పూర్తిగా ఆధారపడటానికి సిద్ధంగా లేరు. ఎస్పీకి ఉన్న యాదవ-ముస్లిం ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే, జాతీయ స్థాయిలో బీజేపీని ఢీకొట్టేందుకు బలమైన ప్రాంతీయ నాయకత్వాన్ని ఆయన కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించబోతున్నారంటూ కేటీఆర్ చేసిన ప్రకటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బలహీనపడుతోందని, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వైఫల్యాలు దేశంలో మరో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని తెస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేస్తూ కీలక పాత్ర పోషిస్తారన్న సంకేతాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నాయి.కొంతకాలంగా జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. కేంద్రంలో అధికార బీజేపీ సంకీర్ణ కూటమిపై ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండీ' కూటమిలో సమన్వయ లోపాలు బయటపడుతున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయం కోసం ప్రాంతీయ పార్టీలు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు కేసీఆర్ తన అనుభవం, జాతీయ రాజకీయాలపై ఉన్న పట్టును ఉపయోగించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రాంతీయ ఆత్మగౌరవ నినాదంతో ఇతర ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా తెరవెనుక కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.కేటీఆర్ చేసిన ఈ ప్రకటన వెనుక కేవలం ఢిల్లీ పీఠాన్ని ప్రభావితం చేయడమే కాదు.. తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత కొంత నైరాశ్యంలో ఉన్న కేడర్‌ను ఉత్తేజపరచడానికి ఇదొక స్ట్రాటజీ అయి ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేసీఆర్ జాతీయ స్థాయిలో మళ్లీ చక్రం తిప్పుతారనే ప్రచారం మానసిక స్థైర్యాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. అలాగే, రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే నినాదంతో శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే ప్లాన్ ఇది.అఖిలేష్ పాల్గొనడం, రైతు సమస్యలు, ఫెడరలిజంపై ఒకే విధమైన విధానాలను పంచుకోవడం వల్ల కేసీఆర్ పిలుపునిస్తే కలసి నడిచే ప్రధాన నాయకులలో అఖిలేష్ యాదవ్ ముందువరుసలో ఉంటారని భావించవచ్చు. ఒడిశాలో సుదీర్ఘకాలం పాలించి ఇటీవల ప్రతిపక్షంలోకి వచ్చిన బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ వైఖరి ఇక్కడ చాలా కీలకమైనది. గతంలో సమాన దూరం పాటించిన బీజేడీ, ఇటీవల ఒడిశాలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్డీయేతో సంబంధాలను పూర్తిగా తెంచుకుంది. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రాంతీయ నిధుల సాధన కోసం కఠిన వైఖరి అవసరమని భావిస్తున్న నవీన్ పట్నాయక్, కేంద్రానికి కౌంటర్ ఇచ్చేందుకు ఈ ప్రాంతీయ వేదికకు మద్దతిచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని అంటున్నారు. ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవడం వెనుక ఉన్న ముఖ్య ప్రణాళిక రాజకీయ రక్షణ . నిధుల పంపిణీలో కేంద్ర ప్రభుత్వ వివక్షను ప్రశ్నించడం, సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థల వాడకంపై ఉమ్మడిగా పార్లమెంట్ లోపల, బయటా నిరసనలు తెలపడం ద్వారా కేంద్రంపై తీవ్ర రాజకీయ ఒత్తిడి తెవచ్చని వీరు లెక్కలు వేస్తున్నారు. ఒకవేళ కేసీఆర్ అనుకున్నట్లుగా ఈ ప్రాంతీయ దిగ్గజాలందరినీ ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే, జాతీయ స్థాయిలో మూడో కూటమి మళ్లీ కీలకమైన శక్తిగా అవతరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వరంగల్ ముక్కలైనప్పుడు ఏమైంది స్ఫూర్తి!?



'వందలేళ్ల వారసత్వం బొగ్గు కోసం బుగ్గి!' పేరుతో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ రాసిన వ్యాసం (10.10.2026) కేవలం బొగ్గు కోసం వందల ఏళ్ళ చరిత్ర గల రామప్ప దేవాలయాన్ని ప్రమాదంలోకి నెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఆయనే కాదు, వరంగల్ ఉమ్మడి జిల్లా పౌర సమాజం మొత్తం ఆ ప్రాంతంలో బొగ్గు తవ్వకం నిలిపి వేయాలనీ, కాకతీయుల వారసత్వ సంపదను, రామప్ప దేవాలయాన్ని కాపాడాలనీ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. రామప్ప దేవాలయ పరిరక్షణ కోసం వినోద్‌కుమార్ ప్రజల పక్షాన నిలబడటాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు స్వాగతిస్తారు. గత ప్రభుత్వ పాలనలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ ఉమ్మడి జిల్లాను ఆరు జిల్లాలుగా ముక్కలు చేయడాన్నే ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రాన్ని 33 జిల్లాలు చేస్తున్న సందర్భంగా 2016లో కేసీఆర్ వరంగల్ నగరాన్ని వరంగల్ అర్బన్ జిల్లాగాను, చుట్టుపక్కల గ్రామాలను వరంగల్ రూరల్ జిల్లాగాను ప్రకటించి 2021 వరకు పాలన కొనసాగించారు. ఆ ఏడాది మరోసారి వరంగల్ నగర పరిధిని రెండు ముక్కలు చేసి తూర్పు భాగాన్ని వరంగల్ జిల్లాగాను, పడమటి భాగాన్ని హనుమకొండ జిల్లాగాను ప్రకటించారు. తన సామాజిక వర్గ కార్పొరేట్ సంస్థకు మెడికల్ కాలేజీ అనుమతి కోసమే ఇలా వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విడదీశారు. పది కిలోమీటర్ల దూరంలో రెండు కలెక్టరేట్లను, పోలీసు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలో కాకతీయుల కాలం నాటి వారసత్వం విస్తరించి ఉందని వినోద్‌కుమార్‌కు తెలియనిది కాదు. రామప్ప దేవాలయం, పాకాల, లక్నవరం సరస్సులు, ధర్మసాగరం ఘనపురం భద్రకాళి చెరువులు, వందలాది గొలుసు కట్టు చెరువులు, వేయి స్తంభాల గుడి, శంభుని దేవాలయం... ఇదంతా కాకతీయ వారసత్వంలో భాగమే. వరంగల్లు, హనుమకొండ, కాజీపేట మూడు నగరాలు కలిసి వరంగల్ నగరంగా ఖండాంతరాలలో ప్రసిద్ధి. వరంగల్ హనుమకొండ మధ్యలో నిజాం కాలం నుండి అత్యంత పేరు ప్రతిష్ఠలు కలిగిన, రకరకాల కుటీర పరిశ్రమల్లో ఖైదీలకు శిక్షణ ఇచ్చే వ్యవస్థగా ఎదిగిన, సకల సదుపాయాలతో అభివృద్ధి చెందిన వరంగల్ జైలును కేసీఆర్ ఆదేశాలతో రాత్రికి రాత్రే నేలకూల్చారు. జైలు కూల్చివేత వరంగల్ ప్రజలకే కాక ఉత్తర తెలంగాణ ప్రజలకు కూడా నచ్చలేదు. వెయ్యి మందికి పైగా ఖైదీలను, 400 మంది జైలు ఉద్యోగులను హుటాహుటిన ఇతర ప్రాంతాలకు తరలించారు. 67 ఎకరాల జైలు భూమిని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు అత్యధిక వడ్డీ రేటు వద్ద కుదువపెట్టి రూ.1100 కోట్ల అప్పుతో కాంట్రాక్టులూ కమీషన్ల కొరకు వైద్యశాల నిర్మాణం ప్రారంభించారు. వరంగల్‌లో మరో జైలు నిర్మాణం ఈనాటికీ జరగలేదు. ఈ అనాలోచిత చర్యవల్ల ఉత్తర తెలంగాణ ఖైదీలు, రిమాండ్ ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు, జైలు ఉద్యోగులు, వారి పిల్లలు అష్టకష్టాల పాలైనారు. వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విడగొట్టమనీ, జైలును కూలగొట్టమనీ, అప్పు తెచ్చి దవాఖాన కట్టమనీ నగర ప్రజలు ఏనాడూ మన మాజీ ముఖ్యమంత్రిని కోరలేదు. ఇవన్నీ చేసిన ఆ ముఖ్యమంత్రి ప్రజలు అడిగిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌నూ, హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణాన్నీ మాత్రం చేపట్టలేకపోయారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా వరంగల్ ఎదుగుతుందని రాష్ట్ర సాధన ఉద్యమ సందర్భంలో ఉమ్మడి జిల్లా ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు భావించారు. కానీ నేడు వరంగల్ జిల్లా ఏ అభివృద్ధికీ నోచుకోకపోగా, సిద్దిపేట సిరిసిల్లతో పోలిస్తే మరింత వెనుకబడిపోయింది. ఓరుగల్లు ప్రజలు నిజాం, వారి తొత్తుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో ముందువరుసలో నిలబడ్డారు, తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ ముందు నిలిచారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు అమలుచేస్తున్న అధికార పార్టీలను మట్టిగరిపించిన సత్తా ఉన్నవారు. బోయినపల్లి వినోద్‌కుమార్ 2004లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికైనారు. లోక్‌సభ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి ఓటమి పొందిన తర్వాత 2018 నుంచి 2023 వరకు తెలంగాణ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులుగా క్యాబినెట్ హోదాలో బాధ్యతలు నిర్వర్తించారు. ఇదే కాలంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ జిల్లా నుంచి కేసీఆర్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. ఈ ఇద్దరూ కాకతీయుల వారసత్వ సంపదపై అవగాహన ఉన్నవారే. వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయ చైతన్యం గురించి తెలిసినవారే. రామప్ప దేవాలయ వారసత్వ సంపదను కాపాడాల్సిందే. కానీ ఈ జిల్లా నాయకులకు ఇదే స్ఫూర్తి వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేసినప్పుడూ, జైలును కూల్చిన సందర్భంలోనూ ఉంటే ఎంతో బాగుండేది. కాకతీయ వారసత్వ సంపదకు నిలువుటద్దంగా నిలిచిన ఓరుగల్లు నగరాన్ని రెండు ముక్కలు చేస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రికి అతి సమీపంగా అధికారాన్ని పొందిన బోయినపల్లి వినోద్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావులు ప్రజల మనోభావాలకు అద్దం పడుతూ కేసీఆర్‌కు నచ్చచెప్పాల్సింది. ఈ ఇద్దరి నాయకుల మౌనం వరంగల్ ప్రజలకు తీరని అన్యాయం చేసింది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఈ నాయకులు జరిగిన నష్టాన్ని ఎలా నివారిస్తారో మహానగర ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత కూడా ఉందని వరంగల్ పౌర సమాజం గుర్తు చేస్తున్నది.

భావాల తుపాను ఇప్పుడే వచ్చిందా?

పాశ్చాత్య దేశాల నుంచి ఒక తుఫాను వచ్చింది. అది అన్నిరకాల వ్యవస్థలనూ, మర్యాదలనూ, శుభప్రదమైన విలువలనూ, సంస్కృతినీ, సంస్కారాలనూ వ్యతిరేకిస్తోంది. దేశ గౌరవానికీ, ప్రతిష్ఠకూ భంగం కలిగించే శక్తులూ, సమాజాన్ని విభజించే వ్యక్తులూ, మన సంస్కృతిపై ద్వేషం చూపించే మనస్తత్వం కలిగిన వాళ్లు.. దేశానికి శత్రువులు. దసరా పండుగ సందర్భంగా భగవత్, మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవి. పదునైనవి. మరో కోణం నుంచి చూస్తే మన సంస్కృతిలోని మంచిచెడుల వివేచనకు ఒక సందర్భాన్ని సమకూర్చేవిగానూ భావించొచ్చు!

ఇస్లాం, క్రైస్తవాలను దేశ సాంస్కృతిక ఐక్యతకు నిరోధకాలుగా భావించటం మనకు కొత్తకాదు. 125 ఏళ్లకు పైగా ఆ రెండు మతాలకు వ్యతిరేకంగా ఎన్నో రూపాల్లో విమర్శలూ వ్యాఖ్యలూ వినపడుతూనే ఉన్నాయి. ఆ మతాలను తీవ్రంగా వ్యతిరేకించటానికే కొన్ని సంస్థలు పుట్టుకొచ్చాయి. వాటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించటానికి రాజకీయపార్టీలూ అవతరించాయి. మన సాంస్కృతిక జీవితాన్ని ఏ రకంగానూ ప్రభావితం చేయలేని స్థాయికి ఆ మతాలను తీసుకెళ్లాలన్న లక్ష్యం దిశగానూ పనిచేశాయి. 1990ల తర్వాత వాటి కార్యాచరణలో అనూహ్యంగా వేగం పెరిగింది. రాజకీయాలన్నీ దాని చుట్టూనే తిరిగాయి. ఇంకా తిరుగుతూనే ఉన్నాయి. హిందూత్వ అనేది మతం కాదనీ, అదొక జీవన విధానమనీ సుప్రీంకోర్టు సైతం వ్యాఖ్యానించటంతో ఆ రాజకీయాలకు బాగా ఊపూ వచ్చింది. మన జాతీయ ఐక్యత సురక్షితంగా ఉండాలంటే హిందూత్వను అందరూ ఆమోదించాలనీ, దాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లను అనుమానంతో చూడాల్సిందేనన్న దృక్పథానికి గత మూడున్నర దశాబ్దాల కాలంలో గణనీయంగా బలం పెరిగింది. భారత్‌లో ఉన్న వాళ్లందరూ మాతృభూమిని పుణ్యభూమిగా చూడాలనీ, దేశభక్తికి అదే కొలమానమనీ చెప్పటం కొంతకాలంగా మామూలైపోయింది. దేశ సరిహద్దుల అవతల పుణ్యభూములనూ, పవిత్రస్థలాలనూ (మక్కా, జెరూసలెం) చూసే వ్యక్తుల విధేయతను శంకించాల్సిన అవసరం ఉందన్న ప్రచారం కూడా చాలా దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. ఇప్పుడు దానికి మించిన పరిణామాలు జరుగుతున్నాయి. కాక్రోచ్ పార్టీ పేరుతో ఆందోళనలు సాగిస్తున్న యువతను కూడా ఇప్పుడు దేశ సంస్కృతికి వ్యతిరేకులుగా భావించటం మొదలవుతోంది. భగవత్, మోదీ విమర్శలను ఈ నేపథ్యం నుంచి చూస్తేనే వాటి సందర్భశుద్ధి ఏమిటో కొంతైనా అర్థమవుతుంది. భగవత్ అయితే ఫ్రాన్స్, అల్బేనియా, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన పరిణామాలను కూడా తన ఉపన్యాసంలో ప్రస్తావించారు. ఆ పరిణామాల వెనుక విదేశీశక్తుల హస్తం ఉందనీ విమర్శించారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి మంచిని స్వీకరించి.. స్వేచ్ఛ, సౌభ్రాత్రం, సమానత్వం, లౌకికవాదం కావాలనీ, సమన్యాయపాలనను అమలుచేయాలనీ కోరుతున్న వాళ్లందరినీ విదేశీశక్తులుగా పరిగణిస్తే మనం మధ్యయుగాల నాటి ఆలోచనల్లోకి వెళ్లిపోతాం. అప్పుడు మన రాజ్యాంగం పునాదులనే ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. చట్టం ముందు అందరూ సమానులేనన్న భావన.. మనం గతంలో అనుసరించిన సంప్రదాయక సామాజిక నీతిలో ఎప్పుడూ భాగం కాదు. ధర్మాన్ని కాపాడటం ముఖ్యకర్తవ్యంగా మన సంప్రదాయ రాజనీతి ఉండేది. ఆ నీతిలో ఒక నేరానికి అందరికీ ఒకే విధమైన శిక్షను ఊహించలేం. కులాన్ని బట్టి, వర్ణాలను బట్టి శిక్షలు ఉండేవి. మనుస్మృతితో పాటు ఇతర స్మృతుల్లో అవి చాలా స్పష్టంగానే ఉన్నాయి. వర్ణ ధర్మాన్నీ కుల కట్టుబాట్లనూ కాపాడటమే రాజుల ప్రథమ కర్తవ్యమని స్మృతులు బోధించాయి. ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా కత్తిఎత్తిన వీరులు కూడా హైందవమత సామాజిక నీతినీ, వ్యవస్థనూ పునరుద్ధరించటమే లక్ష్యంగా ప్రకటించుకున్నారు. అధికారం కోసం జరిగిన ఏ పోరాటంలోనైనా ఏదో ఒక నీతినీ, ధర్మాన్నీ పునరుద్ధరించటానికే అన్నట్లుగా ప్రకటనలూ ఉంటాయి. ఆ దిశగా ప్రజలను ప్రేరేపించటమూ ఉంటుంది. తన స్వార్థం కోసమే, తను అనుభవించటానికే అధికారాన్ని కోరుకుంటున్నట్లు ఏ రాజూ చెప్పడు. సామాజిక సమానత్వ భావనను మన భక్తికవుల్లో కొందరు గట్టిగానే ప్రచారం చేశారు. కానీ అది ప్రచారస్థాయిని దాటి స్థిరమైన రాజకీయ రూపం సంతరించుకుని, రాజ్యాంగనీతిలో, నడవడిలో ఎప్పుడూ ప్రధానభాగం కాలేదు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసమ్మతిని తెలపటం.. దానికి మించి ప్రభుత్వాలను గద్దెదింపే స్థాయిలో ఆందోళనలు చేయటం ప్రజాస్వామ్యంలో అతి సహజం. రాజ్యాంగ పరిధిలో వాటిని చేయాలనటంలో తప్పేమీ లేదు. అలాగే హింసకు తావివ్వకుండా ఆందోళనలు చేయాలని కోరటంలో అనౌచిత్యమూ లేదు. ఆందోళనకారులందరినీ దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేసే వాళ్లుగా భావించటంలోనే ప్రమాదం ఉంది. పాశ్చాత్య భావాల స్ఫూర్తితో ఆందోళనలు చేపట్టడం ఏ రకంగానూ తప్పుకాదు. ఏ భావం ఎక్కడ పుట్టినా అది ఎక్కువ మందికి పనికొచ్చేదైతే పనిగట్టుకుని వ్యతిరేకించాల్సిన అవసరమే ఉండకూడదు. అంతదాకా ఎందుకు.. మన రాజ్యాంగమే పాశ్చాత్య భావాల స్ఫూర్తితో రూపొందింది. రాజ్యాంగసభలో ఎన్నో చర్చలు చేసి దాన్ని రూపొందించారు. మన సంప్రదాయ రాజనీతికీ, కులాల అంతస్తుల ప్రాతిపదికన ఏర్పడిన హెచ్చుతగ్గుల భావనలకు రాజ్యాంగంలో చోటు కల్పించకుండా చూడటానికే పెద్ద కసరత్తు జరిగింది. గోవధ నిషేధం, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం వంటివి రాజ్యాంగంలో ఉన్నా వాటికి పెద్దపీట వేయలేదు. భారత రాజ్యాంగ రచనను నిశితంగా పరిశీలిస్తే మనం ఎరువు తెచ్చుకున్నవే ఎక్కువగా కనపడతాయి. 1935 నాటి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టంలో నుంచి తీసుకున్నవే అందులో అధికంగా ఉన్నాయి. బ్రిటన్, అమెరికా, ఐర్లాండు, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్సు, రష్యా, జర్మనీ, దక్షిణాఫ్రికా రాజ్యాంగాల నుంచి ఎన్నో తీసుకున్నాం. ఎరువు తెచ్చుకున్న వాటిని కొన్ని మార్పులతో మన రాజ్యాంగంలో పొందుపరచటాన్నీ అంబేడ్కర్ కూడా గట్టిగా సమర్థించారు. హిందూ మహాసభ లాంటి సంస్థలు రాజ్యాంగాన్ని అప్పుడే వ్యతిరేకించాయి. సంప్రదాయ మూలాల్లేని రాజ్యాంగమూ ఒక రాజ్యాంగమేనా అంటూ విమర్శలు కురిపించాయి. హిందూ సంస్కృతినీ, వారసత్వాన్నీ నిర్లక్ష్యం చేసిందనీ గర్హించాయి. అన్ని మతాలను సమానంగా చూసే లౌకిక విధానమూ వాటికి నచ్చలేదు. మనుస్మృతి లాంటి వాటిని పరిగణనలోకి తీసుకోకపోవటాన్నీ తిట్టిపోశాయి. దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేయటానికి విదేశీ భావాలతో ప్రేరణపొంది అసమ్మతిని రాజేస్తున్నారని విమర్శించటం రాజకీయ అవసరంగానే ఉండొచ్చు. కానీ మన ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న మన రాజ్యాంగమే అలా ప్రేరణ పొందేలా చేస్తోంది. మన సంప్రదాయాల నుంచి మాత్రమే ప్రేరణ పొందాలని నిర్దేశిస్తే రాజ్యాంగానికి ఆత్మగా ఉన్న ప్రజాస్వామ్యం కనుమరుగవుతుంది. ప్రాథమిక హక్కులు కలిగించే భావనలు అంతర్ధానం అవుతాయి. పాశ్చాత్య భావాలకు అనుగుణంగా రాజ్యాంగ రూపకల్పన చేసినవాళ్లను విమర్శించాలనుకుంటే ఆనాటి ప్రధాన పాత్రధారులనే తప్పుపట్టాల్సి వస్తుంది. నెహ్రూతో పాటు సర్దార్‌పటేల్ కూడా ఆ యజ్ఞంలో ముందువరుసలోనే ఉంటారు. మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేని సంప్రదాయాలనూ, సంస్కృతినీ విమర్శించటమూ ప్రజాస్వామ్య ఆలోచనల్లో చాలా కీలకమైనది. చాలా సహజమైనది. మార్పులు కావాలనుకునే వాళ్లందరినీ విచక్షణ లేకుండా సంస్కృతిని విచ్ఛిన్నం చేసేవారుగా చిత్రీకరించటం రాజ్యాంగం పెద్దపీట వేసిన భావనలకు వ్యతిరేకమే అవుతుంది. కాక్రోచ్ ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారు ప్రత్యేకంగా విదేశీ భావాలతో ప్రేరణ పొందాల్సిన అవసరంలేదు. మన రాజ్యాంగానికే అటువంటి భావాలను ప్రేరేపించే శక్తి ఉంది. ఒక మతమూ, ఒక భాషా, ఒక సంస్కృతీ, భౌగోళిక ఐక్యతా పునాదులుగా ఉండే జాతీయభావం కూడా ముందుగా పాశ్చాత్య దేశాల్లోనే బలపడింది. ఆధునిక భావాల వ్యాప్తిలో భాగంగానే భారత్‌లోనూ జాతీయవాదం వేళ్లూనుకుంది. కాకపోతే ఒక భాష, మతం ఆధారంగా ఉండే జాతీయవాదం స్థానంలో బహు భాషలనూ, బహు సంస్కృతులనూ సమానంగా చూసే జాతీయవాదం భారత్‌లో రూపుదిద్దుకోవాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. మనుషులందరినీ విశ్వకుటుంబంలో భాగమనుకుంటే, విభిన్న సంస్కృతుల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు చరిత్ర పొడవునా జరగటాన్ని విస్మరించలేని వాస్తవంగా గుర్తిస్తే.. ఆందోళనకారులను విచ్ఛిన్నశక్తులుగా భావించలేం. మన సంస్కృతికి చేటుతెచ్చే సమూహాలుగా ముద్రవేయలేం. ఇతర సంస్కృతులతో ప్రభావితం కాని దేశం ప్రపంచంలో ఎక్కడా లేదు. రాజ్యాంగంలో మనం పొందుపరుచుకున్న పాశ్చాత్య భావాలతో సంప్రదాయ సంస్కృతి ఒక్కటే మారటం లేదు. మన ఆర్థిక వ్యవస్థను కూడా ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలతో ఎప్పుడో అనుసంధానం చేశాం. 1991 తర్వాత అది అనూహ్యస్థాయిలో పెరుగుతోంది. మన ఆర్థిక వ్యవస్థలోకి ఎంత ఎక్కువగా విదేశీపెట్టుబడులు వస్తే అంత గొప్పని భావించుకునే పరిస్థితుల్లో, బయట దేశాలతో ప్రేరణపొందిన శక్తులు దేశ సంస్కృతిని నాశనం చేస్తున్నాయని భావించటంలో సహేతుకత ఒకపట్టాన కన్పించదు. ఆర్థిక వ్యవస్థలతో పాటు సంస్కృతులూ ప్రయాణం చేస్తాయి. ఆ ప్రయాణంలో భాగంగా సంప్రదాయాలూ మారతాయి. రాజ్యాంగస్ఫూర్తిని మనం నిక్కచ్చిగా ఒంటబట్టించుకుంటే మన సంప్రదాయాల్లో మంచినీ చెడునీ విడదీయకుండా ఉండలేం. సంస్కృతిని వ్యతిరేకించేవాళ్లు అందులో ఏ అంశాలను విమర్శిస్తున్నారో చూడకుండా, స్పష్టంగా చెప్పకుండా ప్రచార ఉధృతితో వాళ్లను కొంతకాలం దోషులుగా బోనులో నిలబెట్టొచ్చు. అదిప్పుడు సాగుతూనే ఉంది.

సాంకేతిక రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి


న్యూఢిల్లీ : సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో సరికొత్త ఆలోచనలు, అపారమైన ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కీలకమైన సాంకేతిక రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి దేశం ఎదగాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, పరిశోధనలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భారత్‌ను ప్రపంచ సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు. దిల్లీలోని భారత్ మండపం వేదికగా నిర్వహించిన లిలి'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్'లిలిను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సైన్స్, టెక్నాలజీ, పరిశోధనలు, ఆవిష్కరణల ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో భారత్ కూడా తన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలని పేర్కొన్నారు. కొత్త ఆలోచనలను ఆచరణలోకి తీసుకురావడం, స్వదేశీ సాంకేతికతలను అభివృద్ధి చేయడం, దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగలమని విశ్వాసం వ్యక్తం చేశారు.

స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యం

భారత్‌లో తయారవుతున్న సాంకేతిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో గుర్తింపు పెరుగుతోందని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో దేశం సాధిస్తున్న పురోగతి కీలకమని తెలిపారు. భారతదేశంలో తయారైన చిప్స్ తొలి షిప్‌మెంట్లు ప్రపంచ దేశాలకు చేరుకోవడం ప్రారంభమైందని గుర్తుచేశారు. ఇది దేశీయ తయారీ రంగం, సాంకేతిక స్వావలంబన దిశగా సాగుతున్న ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగు అని వివరించారు. సెమీకండక్టర్లు ఆధునిక ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, టెలికమ్యూనికేషన్లు, ఆటోమొబైల్, కృత్రిమ మేధస్సు వంటి అనేక రంగాలకు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీ, పరిశోధన, రూపకల్పన, సంబంధిత పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా దేశీయ అవసరాలను తీర్చడంతోపాటు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ తన పాత్రను పెంచుకోవచ్చని భావిస్తున్నారు.

బ్యాటరీ నిల్వల్లోనూ స్వయం సమృద్ధి

శక్తి నిల్వ వ్యవస్థల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని ప్రధాని తెలిపారు. దేశంలో లభించే ముడి



పదార్థాలను సమర్థంగా వినియోగించుకుంటూ బ్యాటరీ నిల్వల సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్న తరుణంలో విద్యుత్‌ను నిల్వ చేసుకునే సాంకేతికతలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ రంగంలో దేశీయ పరిజ్ఞానం, తయారీ సామర్థ్యాలను పెంపొందించుకోవడం వల్ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. బ్యాటరీ సాంకేతికతలో పురోగతి సాధించడం ద్వారా విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్, పవన విద్యుత్ వంటి రంగాలకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించడం, నూతన పరిష్కారాలను అభివృద్ధి చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు, పారిశ్రామిక రంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని భావిస్తున్నారు.

అణు రంగం నుంచి అంతరిక్షం వరకు

అణుశక్తి, అంతరిక్ష పరిశోధనలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), సెమీకండక్టర్ల వంటి కీలక రంగాల్లో భారత్ తన సామర్థ్యాలను విస్తరించుకుంటోందని మోదీ తెలిపారు. ప్రతి రంగానికి ప్రత్యేకమైన అవసరాలు, సవాళ్లు ఉన్నప్పటికీ వాటన్నింటిలోనూ స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యం ఉమ్మడిగా ఉందన్నారు. పరిశోధనల ద్వారా కొత్త పరిష్కారాలను కనుగొనడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం దేశ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో పరిశోధనలు, ఉపగ్రహ సాంకేతికత, సమాచార వ్యవస్థలు దేశానికి కొత్త అవకాశాలను అందిస్తున్నాయి. అదే సమయంలో కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డేటా ఆధారిత పరిష్కారాలు పరిశ్రమలు, వైద్యం, వ్యవసాయం, విద్య, రవాణా వంటి అనేక రంగాల్లో మార్పులకు దారితీస్తున్నాయి. ఈ పరిణామాలను సద్వినియోగం చేసుకుంటూ భారతీయ సంస్థలు, పరిశోధకులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు.

భారత పరిష్కారాలు ప్రపంచానికి ఉపయోగపడాలి

భారత్‌లోని సమస్యలకు పరిష్కారాలు కనుగొనే క్రమంలో అభివృద్ధి చేసే సాంకేతికతలు ప్రపంచంలోని అనేక ఇతర దేశాల సమస్యలను పరిష్కరించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని మోదీ పేర్కొన్నారు. దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన పరిష్కారాలను అంతర్జాతీయ స్థాయిలోనూ వినియోగించుకునేలా అభివృద్ధి చేయాలని సూచించారు. భారతీయ సాంకేతికతలపై నమ్మకాన్ని పెంపొందించడంతోపాటు వాటి నాణ్యత, సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని అన్నారు. భారత్ అభివృద్ధి చేసిన డిజిటల్ సాంకేతికతలు, 5జీ సేవలను ఈ సందర్భంగా ఉదాహరణలుగా ప్రస్తావించారు. డిజిటల్ పరిజ్ఞానం ప్రజలకు సేవలను వేగంగా అందించడంలో, సమాచార మార్పిడిని సులభతరం చేయడంలో, వివిధ రంగాల్లో సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇలాంటి సాంకేతిక పరిష్కారాలను మరింత అభివృద్ధి చేసి ఇతర దేశాలకు కూడా ఉపయోగపడేలా చేయగలిగితే అంతర్జాతీయ సాంకేతిక రంగంలో భారత్ స్థానం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

పరిశోధనలు, ఆవిష్కరణలే అభివృద్ధికి పునాది

ప్రపంచ సాంకేతిక రంగంలో నాయకత్వం సాధించాలంటే పరిశోధనలు, ఆవిష్కరణలకు నిరంతర ప్రోత్సాహం అవసరం. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజినీర్లు, స్టార్టప్ సంస్థలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం పెరగడం కీలకం. కొత్త ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరీక్షించడం, వాటిని వాణిజ్యపరమైన ఉత్పత్తులుగా మార్చడం, దేశీయంగా తయారీ సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా భారత్ సాంకేతిక స్వావలంబన దిశగా మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో సాధించే పురోగతి కేవలం పారిశ్రామిక అభివృద్ధికే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ఉండాలని ప్రధాని ఆకాంక్షించారు. కీలక సాంకేతికతల్లో దేశీయ సామర్థ్యాలను పెంపొందించుకుంటూ, ప్రపంచ అవసరాలకు అనుగుణమైన పరిష్కారాలను అందించే దేశంగా భారత్ ఎదగాలని స్పష్టం చేశారు. సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ ప్రపంచ సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలవాలన్నదే తమ లక్ష్యమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఈసీ అఫిడవిట్ మోసపూరితం.. ఆ సంస్థకే నష్టం చేకూర్చేలా ఉంది

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌ను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఆ వివరణలో వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం కనిపిస్తోందని తెలిపింది. ఇది ఎన్నికల సంఘం విశ్వసనీయతకే నష్టం కలిగిస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఆ అఫిడవిట్ మోసపూరితంగా ఉందని, పరస్పర విరుద్ధమైన వాదనలతో కూడుకున్నదని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. మరోవైపునవంబర్ 1న దిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీకి అనుమతి ఉపసంహరించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో ఎలాంటి మార్పులూ చేయలేదని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే, ఫారంతోపాటు జతచేసిన కొత్త డిక్లరేషన్ విషయంలో ఈసీ తన వైఖరిని మార్చుకుంటోందని జైరాం రమేశ్ ఆరోపించారు. ఆ డిక్లరేషన్‌ను తప్పనిసరిగా పూర్తి చేయనిదే ఆన్‌లైన్‌లో ఫారం-6 సమర్పించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనలను ఎన్నికల సంఘం ఉల్లంఘించిందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక ఉత్తర్వులపై మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఈసీనెట్ వ్యవస్థపైనా ఆరోపణలు



ఓటర్ల జాబితాల నిర్వహణలో ఈసీనెట్ వ్యవస్థ ద్వారా అధికారాలను కేంద్రీకరించి, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు) తీసుకున్న నిర్ణయాలను పక్కనపెడుతున్నారని జైరాం రమేశ్ ఆరోపించారు. గోవా, బంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో ఈఆర్ఓల నిర్ణయాలను అధిగమించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఐటీ విభాగం పనితీరుపైనా ఆయన విమర్శలు చేశారు. ఈ విభాగం పారదర్శకంగా వ్యవహరించడం లేదని, తన పరిధిని దాటి నిర్ణయాలు తీసుకుంటోందని కమిషనర్లు గతంలో ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈసీనెట్, ఐటీ విభాగం పనితీరుపై కేబినెట్ కార్యదర్శికి కూడా లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

పిటిషన్లను కొట్టివేయాలని ఈసీ విజ్ఞప్తి

ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను కాంగ్రెస్ ప్రస్తావించగా, ఎన్నికల సంఘం వాటిని తోసిపుచ్చింది. పిటిషన్లు అపోహలపై ఆధారపడ్డాయని, ఒక వార్తాపత్రిక కథనాన్ని ఆధారంగా చేసుకుని సంస్థపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని పేర్కొంది. ఈ పిటిషన్లను ప్రాథమిక దశలోనే కొట్టివేయాలని సుప్రీంకోర్టును కోరింది.

ర్యాలీకి అనుమతి ఉపసంహరించలేదు

ఇదిలా ఉండగా, రాంలీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీకి అనుమతి ఉపసంహరించారన్న ఆరోపణలను దిల్లీ పోలీసులు ఖండించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోణంలో ఎన్?ఓసీ జారీ చేసినట్లు వెల్లడించారు. అయితే మైదానానికి సంబంధించిన అధికారుల నుంచి ముందుస్తు అనుమతి పొందడంతో పాటు నిర్దేశించిన నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. అక్టోబర్ 17న కాంగ్రెస్ నేత మనీశ్ ఛత్రత్‌కు పంపిన లేఖ ప్రకారం నవంబర్ 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతికి సంబంధించిన ప్రక్రియ చేపట్టారు. ర్యాలీ ప్రాంగణంలో కీలక ప్రాంతాల్లో హైడెఫినిషన్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం, పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, తాగునీరు, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు కల్పించడం వంటి నిబంధనలు విధించారు. ర్యాలీ భద్రత కోసం సుమారు 3,500 మంది పోలీసులను మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. ప్రాంగణాన్ని 14 జోన్లుగా విభజించి, సీసీటీవీ కెమెరాలు, బాడీ కెమెరాలు, నిఘా వాహనాలతో పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. రిజర్వ్ బలగాలకు చెందిన 10 కంపెనీలను కూడా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మణిపూర్‌లో భద్రతా దళాల ఆపరేషన్

మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలు జరుగుతున్న తరుణంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే కేఎన్ఎఫ్ గ్రూప్‌నకు చెందిన వాడిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి, 1.027 కిలోల బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కాగా, అక్టోబర్ 26న చురాచంద్‌పుర్, ఇంఫాల్ ఈస్ట్ జిల్లాల్లో ఉమ్మడిగా నిర్వహించిన మరో ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా

పక్కా ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం, సోమవారం రాత్రి చురాచంద్‌పుర్ జిల్లా పోలీస్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) 129 బెటాలియన్, 5 అసోం రైఫిల్స్‌కు చెందిన సంయుక్త బృందం 'ఎమ్ సాంగ్‌గెల్' సమీపంలోని కింగ్‌కిన్ గ్రామంలో ఒక ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. ఆ సమయంలో అనుమానాస్పదంగా ఉన్న తెల్లటి బొలెరో వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. అందులో విదేశాల్లో తయారైన ఏకే-సిరీస్ రైఫిల్, హీూ1 రైఫిల్, 240 రౌండ్ల వివిధ రకాల మందుగుండు సామగ్రి, సుమారు 1.027 కిలోల బ్రౌన్ షుగర్ ఉన్న రెండు ప్లాస్టిక్ ప్యాకెట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో డి లాంగ్‌జోల్ గ్రామానికి చెందిన 23 ఏళ్ల లెట్‌ఖోతాంగ్ ఖోంగ్సాయ్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో తాను సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (ఎస్ఓఓ) గ్రూప్‌నకు చెందిన కేఎన్ఎఫ్ (ఎంసీ) కేడర్‌నని చెప్పాడు. మరోవైపు, ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను మణిపుర్ పోలీసులు తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

ఆయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

సోమవారం ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలోని బొంగ్‌బాల్ ఖోలెన్ కొండ ప్రాంతాల్లో భద్రతా దళాలు సోదాలు నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్‌నకు చెందిన ఎమ్ఎన్ సెక్టార్ క్విక్ యాక్షన్ టీమ్ ఇంఫాల్ రేంజ్ూూ బృందాలు, ఇంఫాల్ ఈస్ట్ కమాండో యూనిట్ సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఆ తనిఖీల్లో మ్యాగజైన్‌తో కూడిన ఏ1 రైఫిల్, 303 లైట్ మెషిన్ గన్ (ఎల్ఎంజీ), ఒక 9ఎఎ పిస్టల్, రెండు 12-బోర్ డబుల్ బ్యారెల్ గన్లు, మూడు 12-బోర్ సింగిల్ బ్యారెల్ గన్లు, స్థానికంగా తయారు చేసిన 9ఎఎ పిస్టల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు, అక్టోబరు 24న బిష్ణుపుర్? జిల్లాలో క్వాక్తా బజార్? వైపు వెళున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకుని తనిఖీ చేయగా, అందులో 208 గ్రాముల హెరాయిన్? ఉన్నట్లు గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2023లో మణిపుర్?లో జాతి హింస చెలరేగినప్పటి నుంచి భద్రతా దళాలు వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నాయి. లోయ ప్రాంతానికి చెందిన మెయితీ, కొండ ప్రాంతానికి చెందిన కుకి వర్గాల మధ్య 2023 మే నెలలో చెలరేగిన జాతి ఘర్షణలో కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 49 మంది ఆచూకీ లేకుండా పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మరోవైపు, ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొండ జిల్లాల్లో కుకిలు, నాగాల మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం 50 మంది మరణించారు. అక్టోబర్ 19న కాంగ్‌పోక్పి జిల్లా సరిహద్దుల్లోని ఒక అడవిలో కట్టెలు సేకరించేందుకు వెళ్లిన ముగ్గురు మీతై పౌరులను సాయుధ దుండగులు కాల్చిచంపినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు, ఈ ఘటన లోయ ప్రాంతాల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. అయితే, రాష్ట్రంలో జరుగుతున్న హత్యలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేశారు. దీనితో రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు శాంతి, సంయమనం పాటించాలని ముఖ్యమంత్రి వై.ఖేమ్‌చంద్ సింగ్ విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం.. 'ఆపరేషన్ ట్రైడెంట్'తో భారీ దాడులు



ఔషధాల ఎంఆర్‌పీకి, రిటైలర్లు కొనుగోలు చేసే ధర మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఔషధ తయారీదారులకు అనుకూలంగా వ్యవస్థ మొత్తం ఎందుకు పనిచేస్తోందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మందుల ధరల నియంత్రణకు బాధ్యత వహించే నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) కూడా పూర్తిగా నిర్వీర్యమైన సంస్థలా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. దేశంలో మందుల ధరల దాఖలపై రెండు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మందుల ఎంఆర్‌పీకి, రిటైలర్లకు వాటిని విక్రయించే ధరకు మధ్య ఉన్న భారీ తేడాను ప్రస్తావిస్తూ, ఇలాంటి పరిస్థితి ప్రభుత్వ పర్యవేక్షణలోనే కొనసాగుతోందని పేర్కొంది. ఔషధ తయారీదారులకు ప్రయోజనం చేకూర్చేలా మొత్తం వ్యవస్థ ఎందుకు పనిచేస్తోందని ప్రశ్నించింది. ఇదంతా ప్రభుత్వ కళ్ల ముందే జరుగుతోందని వ్యాఖ్యానించింది. ధరల వ్యత్యాసాన్ని ఇలాగే నియంత్రణ లేకుండా కొనసాగనివ్వాలా? అని నిలదీసింది. ఇదంతా ప్రభుత్వ కళ్ల ముందే జరుగుతోందని వ్యాఖ్యానించింది.

రూ.11 వేల మందు రూ.1.30 లక్షల ధర!

మందుల కొనుగోలు ధరకు, రోగులకు విక్రయించే ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. రూ.11 వేలకే లభించే మందును రూ.1.30 లక్షలకు విక్రయించడాన్ని ధరల సర్దుబాటుగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా లేవని అభిప్రాయపడింది. రిటైలర్లు రూ.15కు కొనుగోలు చేసే డ్రిప్ లైన్‌ను రూ.250కు విక్రయిస్తున్న ఉదంతాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఇలాంటి భారీ వ్యత్యాసాలు కొనసాగుతుంటే ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు (డీపీసీవో) ఉద్దేశం ఏమిటని ప్రశ్నించింది. ధరల నియంత్రణ సంస్థ ఎన్‌పీపీఏ పనితీరు పూర్తిగా నిర్వీర్యమైనట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది.

ఇతర దేశాలతో పోలిస్తే ధరలు తక్కువే: కేంద్రం

దేశంలో మందుల ధరలు ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న దేశంలో మందుల ధరలను ఇతర దేశాలతో పోల్చి మాత్రమే అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది నిర్ణయించలేమని పేర్కొంది. రోగుల ప్రయోజనాల కంటే వ్యాపార ప్రయోజనాలను ముందు ఉంచకూడదని స్పష్టం చేసింది.

నిర్వహణ ఖర్చుల పేరుతో అధిక ధరలా?

ప్రైవేటు ఆసుపత్రుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఆసుపత్రులు 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. రోగులు బయట కొనుగోలు చేసిన మందులను వినియోగించడంలో నకిలీ ఔషధాల ప్రమాదం కూడా ఉంటుందని వివరించారు. అయితే, ఈ వాదనలను ధర్మాసనం అంగీకరించలేదు. ఆసుపత్రులు వైద్య సేవలకు రుసుములు వసూలు చెయొచ్చు, కానీ మందుల ధరలను వాటి కొనుగోలు ధర కంటే 100 నుంచి 200 రెట్లు పెంచడం ఎలా సమర్థనీయమని ప్రశ్నించింది. నిర్వహణ ఖర్చుల కోసం ఇతర మార్గాలను అన్వేషించాలి తప్ప, మందుల ధరల పెంపుతో రోగులపై భారం వేయకూడదని వ్యాఖ్యానించింది. ఇలాంటి వసూళ్లతో ఆసుపత్రులు మనుగడ సాగించకూడదని ఘాటుగా పేర్కొంది.

82 శాతం మందులపై ధరల పరిమితులు లేవా?

డీపీసీవో-2013 ప్రకారం షెడ్యూల్డ్ ఔషధాలపై ధరల పరిమితులు వర్తిస్తుండగా, షెడ్యూల్‌లో లేని మందుల ప్రారంభ ధరలపై తగిన నియంత్రణ లేదని పిటిషనర్ కిషన్ చంద్ర జైన్ వాదించారు. దేశంలో సుమారు 82 శాతం మందులు షెడ్యూల్ పరిధిలోకి రావని, వాటి ప్రారంభ ధరలను ముందుగానే నిర్ణయించే విధానం లేకపోవడం వల్ల తయారీ సంస్థలకు ఎంఆర్‌పీ నిర్ణయంలో అధిక స్వేచ్ఛ లభిస్తోందని పేర్కొన్నారు.

క్యాన్సర్ మందుల ధరలపైనా గతంలో ప్రశ్నలు

అక్టోబర్ 12న ఈ విషయంపై విచారణ జరిగింది. అప్పుడు కూడా ఔషధాల ధరల నియంత్రణపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్?పీలో 30 శాతానికి పరిమితం చేయడంపై కేంద్రం ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొంది. ఇలాంటివి ఇతర మందులకు ఎందుకు విస్తరించలేదని ప్రశ్నించింది. గతంలో ఆసుపత్రులు క్యాన్సర్ మందులను అధిక ధరలు వసూలు చేస్తున్నాయన్న అంశంపైనా అత్యున్నత న్యాయస్థానం కేంద్రంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ మందుల ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్‌పీలో 30 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ. 2,500 కోట్ల ఆదా అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

దేశ ప్రయోజనాలే కొనుగోళ్లలో కీలకం



రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను తగ్గించాలంటూ అమెరికా తమపై ఎలాంటి ఒత్తిడి చేయలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు, రాయితీల ఆధారంగానే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు ఉక్రెయిన్ యుద్ధానికి ముందు చాలా తక్కువగా ఉండేవని పురి గుర్తుచేశారు. అప్పట్లో దేశ చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 0.2 శాతమేనని చెప్పారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురుపై లభించిన రాయితీల కారణంగా దిగుమతులు పెరిగాయని వివరించారు. అయితే, ఇటీవల పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోందని మంత్రి తెలిపారు. మధ్యప్రాచ్య దేశాల నుంచి చమురు సరఫరాలు పెరుగుతున్నాయని, ఆ ప్రాంతం నుంచి మరింత చమురు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్ దిగుమతులను పెంచుకుంది. అదే సమయంలో చైనా నుంచి పోటీ పెరగడం, గల్ఫ్ దేశాల చమురుపై రాయితీలు లభించడంతో భారత రిఫైనరీలు రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించినట్లు నౌకల రవాణా గణాంకాలు వెల్లడించాయి. రష్యా చమురు కొనుగోళ్లు ఇతర దేశాల చమురు ధరలతో పోలిస్తే ఎంత రాయితీ లభిస్తుందనే అంశంపై ఆధారపడి ఉంటాయని పురి తెలిపారు. "చివరకు ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల ఆధారంగానే తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, రష్యా ఇంధన ఎగుమతులపై కొత్త ఆంక్షలు, సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్టోబర్‌లో జాతీయ ప్రయోజనాల నిబంధనల కింద మినహాయింపులు ఇచ్చారు. దీంతో భారత్‌పై విధించే అవకాశం ఉన్న భారీ సుంకాల నుంచి కొంత ఉపశమనం లభించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య కూడా భారత్ ఇంధన సరఫరాలను స్థిరంగా కొనసాగించిందని పురి గతంలో పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో ప్రపంచ ఇంధన డిమాండ్ పెరుగుదలలో దాదాపు నాలుగో వంతు భారత్ నుంచే ఉంటుందని ఆయన తెలిపారు.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎంపీ కేశినేని చిన్ని ప్రచారం

ఒకే రోజు 28 వార్డుల్లో పర్యటన.. తిరువూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు





తిరువూరు, మహానగర్

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో సుడిగాలి పర్యటన చేపట్టి, కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి పి. మాధవి, ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకున్నారు. తొలుత బైపాస్ రోడ్డులోని వినాయక దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం బైపాస్ రోడ్డు, రేపూడి బజార్, మధిర రోడ్డు మీదుగా రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు వంటి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిరువూరు మున్సిపాలిటీలో 28 వార్డులకు సంబంధించి కూటమి సీట్ల సర్దుబాటు ప్రశాంతంగా, పరస్పర అవగాహనతో పూర్తయిందని కేశినేని చిన్ని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కూటమి ఐక్యతను చాటుతున్నారని పేర్కొన్నారు. జనసేనకు చెందిన పి. మాధవిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ప్రకటించామని, ఆమెను భారీ మెజారిటీతో గెలిపించేందుకు మూడు పార్టీల శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు. సీట్ల సర్దుబాటులో పార్టీ కోసం త్యాగాలు చేసిన నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కూటమి ఐక్యంగా ముందుకు సాగుతోందని, తిరువూరు మున్సిపల్ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉండటంతో ఆయన స్థానంలో ప్రచారంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. తిరువూరు మున్సిపాలిటీని రాబోయే ఐదేళ్లలో అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఏర్పాటు, ఆటోనగర్‌కు అనువైన స్థలం ఎంపిక, పట్టణంలోని 11 చెరువుల ఆధునీకరణ, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.220 కోట్లతో తిరువూరు మంచినీటి పథకానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినట్లు, కృష్ణా నది నుంచి నీటిని తీసుకువచ్చి ఏడాదిలోగా ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని సంక్రాంతి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లపై విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యల పరిష్కారం, స్మశానవాటికలు, అంగన్‌వాడీ భవనాల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట వన్‌వే విధానం అమలుపైనా దృష్టి సారిస్తామని చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో తిరువూరుకు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, అమరావతి వంటి నగరాలతో మెరుగైన రవాణా అనుసంధానం ఏర్పడుతుందని, తద్వారా పట్టణ అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీ కేశినేని చిన్ని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికల బరిలో 40 మంది అభ్యర్థులు



ఆగిరిపల్లి, మహానగర్

మండల పరిషత్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి విలియమ్స్‌కు పార్టీ బీ-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 95 నామినేషన్లు దాఖలయ్యాయని, ఉపసంహరణ అనంతరం 40 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. వీరిలో తెలుగుదేశం పార్టీ తరపున 15 మంది, వైఎస్సార్‌సీపీ తరపున 18 మంది, జనసేన పార్టీ తరపున ముగ్గురు, కాంగ్రెస్ పార్టీ తరపున ఒకరు, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు బీ-ఫారాలు అందజేసినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు తమ పార్టీ తరపున పోటీ చేస్తున్నట్లు ధ్రువీకరించే బీ-ఫారాలను సమర్పించినట్లు తెలిపారు.

టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా వీరాబత్తిన జోషిబాబు



ఆగిరిపల్లి, మహానగర్

జెడ్పీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా వీరాబత్తిన జోషిబాబును రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యావంతుడైన జోషిబాబు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ క్రియాశీల సభ్యుడిగా కొనసాగుతున్నారని, ప్రజలతో మమేకమై రాజకీయ అనుభవం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. నూజీవీడు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా రెండుసార్లు పనిచేసిన అనుభవం ఆయనకు ఉందని, ఆగిరిపల్లి మండల ప్రజలకు సుపరిచితుడని తెలిపారు. జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని 18 సెగ్మెంట్లలో కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోషిబాబు మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం.. 'ఆపరేషన్ ట్రైడెంట్'తో భారీ దాడులు



విజయవాడ, మహానగర్:

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ ట్రైడెంట్' పేరుతో భారీ దాడులు చేపట్టింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), ఇతర కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు అక్టోబర్ 23న అస్సాం, మిజోరం, మణిపూర్‌లోని 38 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ఈ చర్యల్లో 18 మందిని అరెస్టు చేసి, 500 డిటోనేటర్లు, రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాల ఆర్థిక నెట్‌వర్క్‌లపై దృష్టి సారించిన అధికారులు సుమారు రూ.100 కోట్ల హవాలా లావాదేవీలను గుర్తించారు. 1,424 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతోపాటు, రూ.17.82 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు వెల్లడించారు. మయన్మార్ సరిహద్దుల ద్వారా సాగుతున్న అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఐజ్వాల్, చంఫాయ్, జోఖావ్తార్, చురాచాంద్‌పూర్, కచార్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. డ్రగ్స్ సరఫరాదారులతోపాటు వాటి వెనుకనున్న హవాలా వ్యవస్థలను ఛేదించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. 2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల నిర్మూలనే లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

సిక్స్త్ సెన్స్ ఏఐ ఫ్రెష్‌నెస్ డిటెక్షన్ టెక్నాలజీని ఆవిష్కరించిన వర్ల్‌పూల్



విజయవాడ

ప్రముఖ గృహోపకరణాల తయారీ సంస్థ వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తన లగ్జూరియమ్ శ్రేణి 4 డోర్ రిఫ్రిజిరేటర్లలో సిక్స్త్ సెన్స్ ఏఐ ఆధారిత తాజాదనం గుర్తింపు సాంకేతికతను ప్రవేశపెట్టింది. భారత్‌లోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన ఈ సాంకేతికత ఫ్రిజ్‌లో నిల్వ చేసిన పండ్లు, కూరగాయలు అతిగా పండుతున్నప్పుడు గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేస్తుంది. దీనికి సంస్థకు చెందిన ఐఫ్రెష్ సెన్సర్ ఇంజిన్ ప్రధానంగా పనిచేస్తుంది. క్రిస్పర్ డ్రాయర్‌లో అమర్చిన ఈ సెన్సర్ పండ్లు, కూరగాయలు పండే సమయంలో సహజంగా విడుదలయ్యే ఇథిలీన్ వాయువు స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తుంది. సిక్స్త్ సెన్స్ ఏఐ వ్యవస్థ ప్రతి 10 సెకన్లకోసారి పరిశీలించి, ఇథిలీన్ స్థాయిలు పెరిగినప్పుడు ముందస్తు అలర్ట్ అందిస్తుంది. దీంతో ఆహారం పాడై వృథా కాకుండా ముందుగానే వినియోగదారులు తగిన నిర్ణయాలు తీసుకోవచ్చు. ఈ సందర్భంగా సంస్థ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ నకుల్ తివారీ మాట్లాడుతూ, భారతీయ కుటుంబాలు వారానికి ఒకసారి పెద్ద మొత్తంలో పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసి ఫ్రిజ్‌లో నిల్వ చేస్తుంటాయని, అవి కనిపించకపోవడం వల్ల పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా తాజాదనంలో మార్పులను ఫ్రిజ్ స్వయంగా గుర్తించి తెలియజేసేలా కొత్త సాంకేతికతను రూపొందించినట్లు వివరించారు.

'ఫీల్ లైక్ ఎ గర్ల్ అగైన్'తో బాల్యపు ఆనందాలను ఆస్వాదించండి

విజయవాడ, మహానగర్



మహిళలు తమలోని చిన్నారిని తిరిగి కలుసుకుని, బాల్యపు మధుర జ్ఞాపకాలను ఆస్వాదించాలనే సందేశంతో పారాచూట్ అడ్వాన్స్‌డ్ గోల్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ 'ఫీల్ లైక్ ఎ గర్ల్ అగైన్' పేరుతో నూతన ప్రచారాన్ని ప్రారంభించింది. పొడవాటి జడలు, స్నేహితులతో నవ్వులు, ఆటపాటలు, స్వేచ్ఛతో కూడిన బాల్యపు అనుభూతులను గుర్తుచేస్తూ ఈ ప్రచారాన్ని రూపొందించింది. ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన ఈ ప్రచార చిత్రంలో ముగ్గురు స్నేహితులు తమ రోజువారీ బాధ్యతల నుంచి విరామం తీసుకుని, తీరప్రాంతంలో పరుగులు పెడుతూ, నృత్యాలు చేస్తూ, ఆటలాడుతూ బాల్యపు ఆనందాన్ని తిరిగి పొందే దృశ్యాలను అందంగా చిత్రీకరించారు. మారికో లిమిటెడ్ ఇండియా సీఎంఓ విక్రమ్ కర్వాల్ మాట్లాడుతూ, వినియోగదారులతో భావోద్వేగ అనుబంధాన్ని పెంపొందించే కథలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రచారానికి కార్తీక్ సంగీతం, శ్వేతా మోహన్ గానం, అనంత శ్రీరామ్ సాహిత్యం, బృందా మాస్టర్ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ మహిళలు తమలోని చిన్నారిని మళ్లీ ఆస్వాదిస్తూ, స్నేహం, ఆనందం, స్వేచ్ఛను వేడుక చేసుకోవాలని ఈ ప్రచారం పిలుపునిస్తోంది.

వరల్డ్ జూనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌కు రాష్ట్ర క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్



చైనాలోని జింగ్షాన్‌లో అక్టోబర్ 27 నుంచి 31 వరకు జరగనున్న 5వ వరల్డ్ జూనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్ 2026లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.దిలీప్ కుమార్ తెలిపారు. విజయవాడకు చెందిన అకేటి శ్రీ వైశాలి, అనంతపురానికి చెందిన ఎస్.ఆరోన్ రొనాల్డిన్ హో భారత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి ఇద్దరు క్రీడాకారులు భారత్‌కు ప్రాతినిధ్యం వహించనుండటంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ ఏ.రవి నాయుడు, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ డా.డి.నవీన్ కుమార్, అధ్యక్షుడు వి.శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజతో పాటు వివిధ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


నవంబర్ 15 నుంచి ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ల ధరల పెంపు

విజయవాడ, మహానగర్:

ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ సంస్థ ఎంపిక చేసిన మోడళ్ల ధరలను నవంబర్ 15 నుంచి పెంచనున్నట్లు ప్రకటించింది. పెరుగుతున్న విడిభాగాల వ్యయాలు, మార్కెట్‌లో కొనసాగుతున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. వినియోగదారులకు అందుబాటు ధరల్లో సాంకేతికతను అందించేందుకు ఇప్పటివరకు ప్రయత్నించినప్పటికీ, ఉత్పత్తి నాణ్యత, పనితీరు, ధరల మధ్య సమతుల్యతను కొనసాగించేందుకు ధరలను సవరించాల్సి వచ్చిందని తెలిపింది. ఎంపిక చేసిన మోడళ్లపై రూ.1,000 నుంచి రూ.3,000 వరకు ధరలు పెరగనున్నాయి. ఏఐ ప్లస్ పల్స్ 2 ఎఫ్ఈ, పల్స్ 2, నోవా 2 5జీ, నోవా 2 నియో 5జీ, నోవా 2 పవర్ 5జీ, నోవా 2 ప్రో 5జీ, నోవా 2 అల్ట్రా 5జీ మోడళ్లలోని కొన్ని వేరియంట్లకు ఈ పెంపు వర్తించనుంది. అయితే, నోవాఫ్లిప్ 5జీ ధరలో మార్పు ఉండదు. ఈ ఫోన్ ధర రూ.49,999గానే కొనసాగుతుంది. కొత్త ధరలు అమల్లోకి వచ్చే ముందు నవంబర్ 14 వరకు వినియోగదారులు ప్రస్తుత ధరలకే ఆయా స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేయవచ్చని కంపెనీ వెల్లడించింది. మార్కెట్ పరిస్థితులను పర్యవేక్షిస్తూ అందుబాటు ధరల్లో నమ్మకమైన పనితీరు, మెరుగైన వినియోగ అనుభవాన్ని అందించడంపై దృష్టి కొనసాగిస్తామని పేర్కొంది.

చిరుధాన్యాలతో ఇంద్రియా భారీ రంగవల్లి

గుంటూరు, మహానగర్



ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ప్రముఖ ఆభరణాల బ్రాండ్ ఇంద్రియా దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత ఆభరణ రంగవల్లిని బెంగళూరులో ఆవిష్కరించింది. భారతీయ సాంస్కృతిక వారసత్వం, పండుగ సంప్రదాయాలకు నివాళిగా రాజాజీనగర్‌లోని ఒరాయన్ మాల్, త్యాగరాజనగర్‌లోని శ్రీ సత్య గణపతి షిర్డీ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో సుమారు 1,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ రంగవల్లిని రూపొందించారు. ఇంద్రియా పండుగ ప్రత్యేక కలెక్షన్ పద్మిక్ ఆభరణాల డిజైన్ స్ఫూర్తితో రూపొందించిన ఈ కళాఖండంలో బియ్యం, రాగులు, కొర్రలు తదితర చిరుధాన్యాలు, సహజ ధాన్యాలను వినియోగించారు. 22 క్యారెట్ల బంగారంతో రూపొందించిన పద్మిక్ ఆభరణ శ్రేణిలో ప్రాచీన గులాబీ మీనాకారీ కళకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రముఖ రంగోలి కళాకారిణి శిఖా శర్మ ఈ ప్రాజెక్టుకు తన కళా నైపుణ్యాన్ని అందించారు. ఇంద్రియా మార్కెటింగ్, విజువల్ మర్చండైజింగ్ హెడ్ శాంతిస్వరూప్ పాండా మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, హస్తకళలను సమకాలీన రూపంలో ప్రజలకు చేరువ చేయడమే తమ లక్ష్యమన్నారు. విజయదశమి అనంతరం రంగవల్లి తయారీలో ఉపయోగించిన ధాన్యాలు, పప్పుదినుసులను గోశాల సహకారంతో పక్షులు, మూగజీవాలకు ఆహారంగా అందించనున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న రంగవల్లి పోటీలో ఎంపికైన 100 మంది విజేతలకు 22 క్యారెట్ల బంగారు నాణేలను బహుమతిగా అందించనున్నారు.

బిజినెస్

'ఫీల్ లైక్ ఎ గర్ల్ అగైన్'తో పారాచూట్ అడ్వాన్స్‌డ్ గోల్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ నూతన ప్రచారం



గుంటూరు, మహానగర్

'ఫీల్ లైక్ ఎ గర్ల్ అగైన్' పేరుతో పారాచూట్ అడ్వాన్స్‌డ్ గోల్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ నూతన ప్రచారాన్ని ప్రారంభించింది. మహిళలు తమలోని చిన్నారిని తిరిగి కలుసుకుని, బాల్యపు మధుర జ్ఞాపకాలను ఆస్వాదించాలనే సందేశంతో పొడవాటి జడలు, స్నేహితులతో నవ్వులు, ఆటపాటలు, స్వేచ్ఛతో కూడిన బాల్యపు అనుభూతులను గుర్తుచేస్తూ ఈ ప్రచారాన్ని రూపొందించింది. ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన ఈ ప్రచార చిత్రంలో ముగ్గురు స్నేహితులు తమ రోజువారీ బాధ్యతల నుంచి విరామం తీసుకుని, తీరప్రాంతంలో పరుగులు పెడుతూ, నృత్యాలు చేస్తూ, ఆటలాడుతూ బాల్యపు ఆనందాన్ని తిరిగి పొందే దృశ్యాలను అందంగా చిత్రీకరించారు. మారిగో లిమిటెడ్ ఇండియా సీఎంఓ విక్రమ్ కర్వాల్ మాట్లాడుతూ, వినియోగదారులతో భావోద్వేగ అనుబంధాన్ని పెంపొందించే కథలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రచారానికి కార్తీక్ సంగీతం, శ్వేతా మోహన్ గానం, అనంత శ్రీరామ్ సాహిత్యం, బృందా మాస్టర్ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్ మహిళలు తమలోని చిన్నారిని మళ్లీ ఆస్వాదిస్తూ, స్నేహం, ఆనందం, స్వేచ్ఛను వేడుక చేసుకోవాలని ఈ ప్రచారం పిలుపునిస్తోంది.

జియో 27 లక్షలు.. ఎయిర్‌టెల్ 26 లక్షలు

ఇంటర్నెట్ డెస్క్: దేశంలోని టెలికాం వినియోగదారుల సంఖ్య సెప్టెంబర్‌లో పెరిగింది. కొత్తగా 65 లక్షల మంది (6.57 మిలియన్) సబ్‌స్క్రైబర్లు చేరారు. దీంతో మొత్తం వినియోగదారుల సంఖ్య 130 కోట్లకు చేరింది. ఈ మేరకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలను వెలువరించింది. సెప్టెంబర్ నెలలో అన్ని టెలికాం కంపెనీలూ తమ సబ్‌స్క్రైబర్ల బేస్‌ను పెంచుకోవడం గమనార్హం. ఎప్పటిలానే జియో ఎయిర్‌టెల్ ముందు వరుసలో నిలిచాయి. సెప్టెంబర్ నెలలో జియో నెట్‌వర్క్‌లోకి 27.12 లక్షల మంది వచ్చారు. దీంతో కంపెనీ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 511.14 మిలియన్లకు (51 కోట్లకు) చేరింది. అదే సమయంలో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను 26.92 లక్షల మంది కొత్తగా ఎంచుకున్నారు. దీంతో మొత్తం సబ్‌స్క్రైబర్ బేస్ 494.29 మిలియన్లకు (49 కోట్లు) పెరిగింది. వొడాఫోన్‌ను కొత్తగా 5.50 లక్షల మంది ఎంచుకోగా.. బీఎస్ఎన్ఎల్‌లో 6.25 లక్షల మంది చేరారు. సెప్టెంబర్ నెలలో 1.6 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీని ఎంచుకున్నట్లు ట్రాయ్ తెలిపింది.

ల్యాప్‌టాప్‌లు ఆఫ్.. ఐడీలు డీయాక్టివేట్..
లంచ్ టైమ్‌లో లేఆఫ్‌లు!



మనుషులు చేసే చాలా పనులు ఏఐ చేస్తోందని, కంపెనీ ప్రాధాన్యతలకు తగ్గట్టుగా ఉద్యోగుల పునర్వ్యవస్థీకరణ అంటూ టెక్ పరిశ్రమలు కొంతకాలంగా లేఆఫ్‌లు ప్రకటిస్తూనే ఉన్నాయి. కొన్ని సంస్థలు ముందుగా సమాచారం ఇస్తుంటే.. ఇంకొన్ని అకస్మాత్తుగా సిబ్బందిని తొలగించి షాక్‌కు గురిచేస్తున్నాయి. తాజాగా ఏఐ సర్వీసెస్, గ్లోబల్ డేటా ఇంజినీరింగ్ సంస్థ ఇన్నోడేటా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగులకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఎప్పటిలాగే విధుల్లో నిమగ్నమైన పలువురు ఉద్యోగుల ల్యాప్‌టాప్‌లు అనూహ్యంగా లాగౌట్ అయ్యాయని, వారి ఐడీలు డీయాక్టివేట్ అయ్యాయని సోమవారం జరిగిన లేఆఫ్‌ల గురించి ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. "ఎప్పటిలాగే మా రోజూవారీ పనిని ప్రారంభించాం. మధ్యాహ్నం సమయంలో ఉద్యోగాల కోత గురించిన వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. ఆ వెంటనే ఒకరి తర్వాత ఒకరు కంపెనీ సిస్టమ్స్ నుంచి యాక్సెస్ కోల్పోయారు. ఐడీలు డీ-యాక్టివేట్ అయ్యాయి. అనంతరం వ్యక్తిగత ఈ-మెయిల్ ఖాతాలకు తొలగింపు మెయిల్స్ వచ్చాయి" అని ఉద్యోగులను ఉటంకిస్తూ సదరు మీడియా కథనం పేర్కొంది. వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసున్నామని, పనితీరు ఆధారంగా తొలగింపులు కాదని ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్‌లో ఆ సంస్థ తెలిపింది.

మొత్తంగా భారత్‌లో 550 మంది సిబ్బందిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది ఫిలిప్పీన్స్‌లోని తన కార్యాలయాల్లో పలువురు ఉద్యోగులను ఇన్నోడేటా తొలగించింది. హెచ్ఆర్ యాప్‌నకు యాక్సెస్ కూడా నిలిపివేయడతో ఉద్యోగులు తమ పేస్లిప్‌లు, ఇతర కీలక డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా లభించలేదని తెలుస్తోంది. దాంతో బాధితులంతా సోషల్ మీడియాలో ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేసుకొని, కంపెనీకి తమ పరిస్థితిని వివరించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా ఇన్నోడేటా సేవలందిస్తోంది. టెక్ కంపెనీలకు ఏఐ వ్యవస్థలను నిర్మించడానికి, సేవలను మెరుగుపర్చడానికి సహకరిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, యాపిల్, సోనీ, బోయింగ్, డెలాయిట్ వంటి దిగ్గజ సంస్థలు ఈ సంస్థ కస్టమర్ల జాబితాలో ఉన్నాయి. 2025 వార్షిక నివేదిక ప్రకారం.. అంతర్జాతీయంగా ఇన్నోడేటా సంస్థలో 10,107 మంది సిబ్బంది ఉన్నారు.

జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్.. ఊరిస్తున్న టాప్-2



ఇంటర్నెట్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అక్టోబరు 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.10.3 లక్షల కోట్ల మార్కెట్ విలువతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు కానుంది. రూ.10 లక్షల కోట్ల మార్కెట్ విలువతో వస్తున్న తొలి కంపెనీగా జియో రికార్డులకెక్కనుంది. ఇప్పటి వరకు ఏ భారతీయ కంపెనీ కూడా ఈ మార్కెట్ విలువ వద్ద లిస్టింగ్‌కు రాలేదు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.16.2 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ.12.2 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.10.6 లక్షల కోట్లు) మార్కెట్ విలువ పరంగా టాప్-3లో ఉన్నాయి. ఐపీఓ వాల్యూషన్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా అవతరించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ షేర్లు ప్రీమియంతో లిస్టయ్యే అవకాశం ఉన్నట్లు గ్రే మార్కెట్ ప్రీమియం సూచిస్తోంది. ఆ లెక్కన ఇష్యూ ధరతో (రూ.1119) పోలిస్తే 20 శాతం ప్రీమియంతో రూ.1340 వద్ద లిస్టయ్యే అవకాశం ఉందని అంచనాలున్నాయి. అదే జరిగితే కంపెనీ మార్కెట్ విలువ రూ.12.3 లక్షల కోట్లకు చేరుతుంది. దీంతో మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత రెండో అతిపెద్ద కంపెనీగా జియో ప్లాట్‌ఫామ్స్ నిలుస్తుంది.

ఐపీఓ వాల్యూషన్ ప్రకారం చూసినా రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్ కంపెనీల మార్కెట్ విలువ రూ.27 లక్షల కోట్లుగా ఉంది. 2026 అక్టోబరు 27నాటికి టాటా గ్రూపునకు చెందిన 32 లిస్టెడ్ కంపెనీల కంబైన్డ్ మార్కెట్ విలువ రూ.25.7 లక్షల కోట్లుగా ఉంది. అదానీ గ్రూపునకు చెందిన 11 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.16.6 లక్షల కోట్లుగా ఉంది. ఒకవేళ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ప్రీమియం ధర వద్ద లిస్టయితే రిలయన్స్ గ్రూప్ మార్కెట్ విలువ సుమారు రూ.30 లక్షల కోట్లకు చేరుతుంది.

వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ..
రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

- కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం
- యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు
- పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్
- ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా
- భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు



న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు. ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



మా ప్లాన్ చాలా సింపుల్.. వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది.

స్పోర్ట్స్

ఆంధ్ర బౌలర్ల దీటైన ప్రదర్శన

8 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసిన చత్తీస్‌ఘర్



విజయవాడ స్పోర్ట్స్, మహానగర్

మూలపాడులో జరుగుతున్న ఆంధ్ర-చత్తీస్‌ఘర్ రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ఆసక్తికరంగా సాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు సాధించిన స్కోరుకు సమాధానంగా బ్యాటింగ్‌కు దిగిన చత్తీస్‌ఘర్ జట్టును ఆంధ్ర బౌలర్లు దీటుగా ఎదుర్కొన్నారు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెంచుతూ కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి చత్తీస్‌ఘర్ జట్టు 8 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. చత్తీస్‌ఘర్ బ్యాటర్లలో అమన్‌దీప్ ఖారే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. 171 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లతో 74 పరుగులు సాధించి జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అతని పోరాటంతో చత్తీస్‌ఘర్ జట్టు గౌరవప్రదమైన స్కోరు దిశగా సాగింది. ఆంధ్ర బౌలర్లలో త్రిపురణ విజయ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టాడు. సౌరభ్ కుమార్ 2 వికెట్లు సాధించగా, లలిత్ మోహన్, శశికాంత్ చెరో వికెట్ తీసి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆంధ్ర బౌలర్లు సమిష్టిగా రాణిస్తూ చత్తీస్‌ఘర్ జట్టు భారీ స్కోరు సాధించకుండా అడ్డుకున్నారు. రెండో రోజు ఆటలో ఇరు జట్లు తమదైన శైలిలో పోరాటాన్ని కొనసాగించాయి. ఆంధ్ర బౌలర్లు కీలక వికెట్లు సాధించడంతో మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం చత్తీస్‌ఘర్ జట్టు 8 వికెట్లు కోల్పోయి 216 పరుగులతో కొనసాగుతుండటంతో మూడో రోజు ఆట కీలకంగా మారనుంది. ఆంధ్ర బౌలర్లు ఇదే స్థాయిలో రాణించి మిగిలిన వికెట్లు త్వరగా పడగొడతారా? లేక చత్తీస్‌ఘర్ జట్టు మూడో రోజు మరింత స్కోరు సాధిస్తుందా? అన్న ఆసక్తి క్రికెట్ అభిమానుల్లో నెలకొంది. ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతున్న నేపథ్యంలో మూడో రోజు ఆటపై మరింత ఉత్కంఠ నెలకొంది.



రష్మిక పాత్ర కోసం వెళ్లి సీతగా.. ‘సీతారామం’ చిత్రంలో మృణాల్ ఠాకూర్ ఎంపిక అసలు కథ ఇదే!

యువ నటి మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ‘సీతారామం’ ఎంతటి మైలురాయిగా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఈ చిత్రంలో ఆమెను మొదట ‘అఫ్రీన్’ పాత్ర కోసమే సంప్రదించారట. కానీ కథ చెప్పే క్రమంలో దర్శకుడు హను రాఘవపూడి ఆమెను చూసి మనసు మార్చుకుని, ఏకంగా ‘సీత మహాలక్ష్మి’ ప్రధాన పాత్రకు ఎంపిక చేయడం విశేషం. దర్శకుడు హను రాఘవపూడి దాదాపు ఐదు గంటల పాటు ఎంతో ఓపికగా, భావోద్వేగాలతో ఈ కథను తనకు వినిపించారని, ఆ నెరేషన్ తనను ఎంతగానో కదిలించిందని మృణాల్ పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు. నాగ్ అశ్విన్ ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ బ్యూటీ, సీత పాత్రలో ఒదిగిపోయి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆ పాత్రలోని స్వచ్ఛత, అంకితభావం ఈ సినిమాను టాలీవుడ్‌లో ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలబెట్టాయి.

నాకు భర్త అవ్వాలంటే.. ఇవి ఉండాలి

తెలుగు సినీ పరిశ్రమలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యువ కథానాయిక రితికా నాయక్. ‘అశోకవనంలో అర్జున కల్యాణం’, ‘మిరాయ్’ చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీ.. నేడు పుట్టినరోజు నిర్వహించుకుంటోంది. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన ఆసక్తికర విషయాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. గతంలో ఓ ఇంటర్వ్యూలో తనకు నచ్చిన హీరో ఎవరో చెప్పిన రితికా.. తనను పెళ్లి చేసుకునే వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు ఉండాలో కూడా వెల్లడించింది. ఇప్పుడీ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

సినిమా రంగంలో కథానాయికగా గుర్తింపు తెచ్చుకోవాలంటే అందం ఒక్కటే సరిపోదు. నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలి. ఇదే ఆలోచనతో ముందుకు సాగుతోంది రితికా నాయక్. తనకు అందమైన రూపం ఉందని మాత్రమే కాకుండా.. ‘బాగా నటిస్తుంది’ అని ప్రేక్షకులు అనుకోవాలన్నదే తన లక్ష్యమని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అన్ని రకాల పాత్రల్లో నటించాలని ఉందని, ఒక్క తరహా పాత్రలకే పరిమితం కావడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసింది.

మీ క్రష్ ఎవరని రితికాను ఓ సందర్భంలో అడగ్గా.. తనకు అల్లు అర్జున్‌పై క్రష్ ఉందని రితికా నాయక్ చెప్పుకొచ్చింది. అదే సందర్భంలో జీవిత భాగస్వామి విషయంలోనూ ఆమెకు కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉన్నాయని తెలిపింది. తనను ఎంతో ప్రేమించే వ్యక్తి కావాలని, బంధంలో నమ్మకానికి ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. అంతేకాదు.. తన వృత్తిని అర్థం చేసుకుంటూ, కెరీర్‌లో ముందుకు సాగేందుకు ప్రోత్సహించే వ్యక్తి తనకు భర్తగా రావాలని కోరుకుంటున్నట్లు పేర్కొంది. కాగా ఇటీవల కొరియన్ కనకరాజుతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన రితికా.. వరుస అవకాశాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం వరుణ్‌తేజ్‌తో కలిసి ‘డ్యూయెట్’ అనే సినిమాలో నటిస్తోంది.



అయ్యప్పపై ‘మాలికాపూరం’ దర్శకుడి కొత్త చిత్రం.. ‘మణికంఠ’ ఫస్ట్ లుక్ విడుదల

మలయాళంలో సంచలన విజయం సాధించిన బ్లాక్‌బస్టర్ చిత్రం ‘మాలికాపూరం’ దర్శకుడు విష్ణు శశి శంకర్ నుంచి మరో ఆధ్యాత్మిక చిత్రం రాబోతోంది. తంత్రా ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘మణికంఠ’ అయ్యప్ప స్వామి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. ‘(అయ్యప్ప దర్శనానికి సిద్ధం కండి) అంటూ సాగిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వైభవ్ టైటిల్ రోల్‌లో నటించబోతుండగా, మీనాక్షి గోవిందరాజన్ అరవింద్ ఆకాష్ జె.కె. శరవణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్ గి అమరన్ సంగీతం అందిస్తుండగా, సూర్య రాజీవన్, శతశ్ కుమార్ తదితరులు ఇతర సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్నారు. అయ్యప్ప భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ ‘మణికంఠ’ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.

ఇటు సీత.. అటు ఐపీఎస్ ఆఫీసర్

సాయిపల్లవి.. ఈ పేరు రాబోయే నెలరోజుల్లో కాస్త గట్టిగానే వినిపించనుంది. ఎందుకంటే చాన్నాళ్లుగా దక్షిణాది సినిమాల్లో కనిపించని ఈ బ్యూటీ.. కేవలం 15 రోజుల వ్యవధిలో రెండు క్రేజ్ ఉన్న మూవీస్‌తో రాబోతుంది. ఆయా పాత్రలు, సదరు చిత్రాల్లో సాయిపల్లవే మెయిన్ హైలైట్‌గా కానుందని అనిపిస్తోంది. మొదటగా ‘రామాయణ’ విషయానికొస్తే ఇందులో ఈమె సీత పాత్ర పోషించింది. వచ్చే శుక్రవారం అంటే నవంబర్ 05న పాన్ ఇండియా రేంజులో ఈ మూవీ రిలీజ్ కానుంది. టీజర్ వచ్చినప్పుడు సీత పాత్ర, ఆహార్యాన్ని సందేహిస్తూ కొందరు ట్రోల్స్ చేశారు. ట్రైలర్, సాంగ్స్ వచ్చిన తర్వాత ఇవి కాస్త తగ్గినట్లే కనిపించాయి. ప్రమోషనల్ కంటెంట్‌పై ఎన్ని విమర్శలైనా రావొచ్చు కానీ మూవీ వచ్చిన తర్వాత అందులో సీత పాత్ర ఆకట్టుకుంటే మాత్రం ఇవన్నీ పక్కకువెళ్లిపోతాయి. ‘ఓం’ విషయానికొస్తే.. ధనుష్ హీరోగా చేసిన తమిళ సినిమా ఇది. ఇందులో ఐపీఎస్ నిత్యారెడ్డి అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా సాయిపల్లవి నటించింది. ఈమె పాత్రకు సంబంధించిన గ్లింప్స్ అయితే అదిరిపోయింది. ధనుష్, మమ్ముట్టి పాత్రలతో పాటు ఈమెది ఎక్కువగా హైలైట్ అయ్యేలా ఉందనిపిస్తోంది. ఈ మూవీ నవంబర్ 20న తెలుగు, తమిళంలో రిలీజ్ కానుంది. గతేడాది ఫిబ్రవరిలో ‘తండేల్’ మూవీతో థియేటర్లలోకి వచ్చిన సాయిపల్లవి.. అద్భుతమైన సక్సెస్ అందుకుంది. మళ్లీ ఈ ఏడాది మే నెలలో ‘ఏక్ దిన్’ అని హిందీలోకి ఎంట్రీ ఇచ్చింది కానీ ఇది ఘోరంగా డిజాస్టర్ అయింది. దీంతో ఆశలన్నీ ‘రామాయణ’ మీదే పెట్టుకుంది. ఒకవేళ ఈ రెండు సినిమాలు హిట్ అయి, సాయిపల్లవి పాత్రలకు పేరొస్తే ఈ నవంబర్ ఈమెకు స్పెషల్ అవుతుంది. లేదంటే కష్టమే!



PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999